ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37.0
కనిష్ఠం : 27.0

బస్టాండ్‌లో పరిశుభ్రత పాటించాలి : కలెక్టర్
లోపలి పేజీలో..

మహా పండుగలో మనవాళ్లు..

కడపలో అట్టహాసంగా ప్రారంభమైన పసుపు పండుగ తెలుగుదేశం మహానాడుకు ఉమ్మడి పశ్చిమ నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. పశ్చిమ, ఏలూరు జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు భాగస్వాముల య్యారు. తొలిరోజు పార్టీ ప్రతినిధుల సభలో వీరు పార్టీ సంస్థాగత నిర్మాణం, విధి విధానాలు, సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణపై తమ వాణిని విన్పించారు.


సభలో మంత్రులు నిమ్మల, కొలుసు




మహానాడు ప్రాంగణంలో కైకలూరు టీడీపీ నేతల సందడి


మహానాడు వేదికపై ఎంపీ మహేశ్, ఎమ్మెల్యే చంటి మాటామంతీ


భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రాజు



వేదిక వద్ద సమాచార కేంద్రం

కరోనా టెన్షన్



ఏలూరులో దంపతులకు కొవిడ్

ఏలూరు అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కలవరపెడుతున్న కొవిడ్-19 ఏలూరు జిల్లాలోకి తాజాగా అడుగుపెట్టింది. నగరంలోని దంపతులకు కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ కాగా, విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడించాయి. నగరంలోని శాంతి నగర్‌కు చెందిన ఓ మహిళ(55) గుండె సంబంధిత కరోనరీ యాంజియోప్లాస్టీ శస్త్రచికిత్స నిమిత్తం ఈ నెల 20న విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరగా అదేరోజు సర్జరీ చేశారు. ఆమె వెంట భర్త(63) ఉన్నారు. సర్జరీ అనంతరం 22న ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేయగా ఏలూరులోని నివాసా నికి చేరుకున్నారు. అకస్మాత్తుగా జ్వరం, జలుబు, తదితర లక్షణాలు చుట్టు ముట్టగా, తిరిగి 24న అదే ఆసుప త్రిలో భార్యను చేర్చారు. వైద్యులు ఇద్దరి నుంచి 25న స్వాబ్‌లను సేకరించి ల్యాబ్ పరీక్షలకు పంప గా 26న కొవిడ్-19 పాజిటివ్ నిర్ధార ణైంది. భార్యకు మాత్రమే కొవిడ్ లక్షణాలు స్వల్పంగా ఉన్నాయని, భర్తకు ఎటువంటి లక్షణాలు లేవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు మంగళవారం వెల్ల డించాయి. ఇద్దరూ డయాబెటిక్, హైపర్ టెన్షన్ రోగులనేనని వివరించాయి. కొవిడ్- 19 తొలివేవ్ 2021 సమయంలో వీరిద్దరూ రెండు డోస్‌ల కొవిషీల్డ్ వ్యాక్సిన్ తీసుకోవ డం గమనార్హం. వీరికి కొవిడ్ పాజిటివ్ ఇదే మొదటిశారని వైద్యవర్గాలు తెలిపాయి.



కంటైన్మెంట్ జోన్‌లో టెస్టులు

ఏలూరులో ఇద్దరికి కొవిడ్ పాజిటివ్ నిర్ధారణతో ముందుజాగ్రత్త చర్యలను మంగళవారమే చేపట్టింది. బాధితుల నివాసానికి 100 మీటర్ల పరిధిని కంటైన్మెంట్ జోన్‌గా పరిగణించి, ఐదు వైద్య బృందాలతో ఇంటింటా జ్వరం, జలుబు, ఆయాసం, గొంతునొప్పి, తదితర కొవిడ్ లక్షణాలతో ఎవరైనా ఉన్నారనే దానిపై స్ర్కీనింగ్ టెస్టులను నిర్వహించింది. ఈ టెస్టుల్లో అనుమానిత లక్షణాలు ఎవరిలోనూ బయటపడలేదని వైద్యాధికారులు వివరించారు. తాజా పరిణామాలతో కొవిడ్ ముందస్తు జాగ్రత్తలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం, అదే సమయంలో వైద్య బృందాలతో సిద్ధంగా ఉండడానికి ఏర్పాట్లుచేశారు. స్థానిక సచివాలయాల సిబ్బంది సేవలను వినియోగించుకుంటున్నారు.

ఆమెకు కొవిడ్ !

తణుకులో మహిళకు వచ్చిందంటూ సోషల్ మీడియాలో ప్రచారం

భీమవరం క్రైం/తణుకు రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి):తణుకు మండలం పైడిపర్రులో ఒక మహిళకు కరోనా సోకిందంటూ మంగళవారం పెద్దఎత్తున ప్రచారం జరిగింది. సోషల్ మీడియాలో కొందరు కరోనా జిల్లాకు వచ్చిందంటూ పోస్టులు పెట్టారు. ఆ మహిళ పది రోజుల క్రితం చార్‌ధామ్ యాత్రకు వెళ్లి రెండు రోజుల క్రితం వచ్చారు. ఆమె జ్వరం, జలుబుతో బాధపడుతోంది. మంగళవారం ఆయాసం రావడంతో తణుకులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు పరీక్షలు చేసి కరోనా లక్షణాలు వున్నాయని, వేరే ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే పూర్తి పరీక్షలు జరగకుండానే ఆమెకు కరోనా సోకిందని ఎలా నిర్ధారిస్తారని జిల్లా వైద్యాధికారి గీతాబాయి మండిపడ్డారు. ఆ మహిళకు లక్షణాలు కనబడడంతో వైద్యులు రాజమహేంద్రవరం వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారని, సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని తెలిపారు. ప్రస్తుతం వస్తున్న కరోనా వేరియెంట్ అంత ప్రమాదకరమైంది కాదన్నారు. 'కరోనా విజృంభిస్తే పూర్తిస్థాయిలో వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆక్సిజన్ ఉన్న ఆసుపతుల్లో ఇప్పటికే వాటిని పునరుద్ధరించాం. ప్రతి ఆసుపత్రిలో 100 నుంచి 110 మంది వైద్యం పొందేలా ఏర్పాట్లు చేశాం. ఏలూరులో వీఆర్‌డీఎల్ అందుబాటులో ఉంది. తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రులలో గతంలోనే కోటి రూపాయలు చొప్పున విరాళాలు రావడంతో ఆక్సిజన్ పరికరాలను ఏర్పాటు చేశాం. వాటికి ప్రస్తుతం మరమ్మతులు చేయించాం. వెంటిలేటర్లను అందుబాటులోకి తీసుకొచ్చాం. భయపడాల్సిన అవసరం లేదని జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు.

విషాదం


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీపల్లవి, ఎస్ఐ శివకృష్ణ

- గోదావరిలో ఈత నేర్చుకునేందుకు దిగి ముగ్గురు బాలురు గల్లంతు
- బయటపడిన మరో ఇద్దరు.. ఐదు రోజులుగా నాగుల్లంక నుంచి రావిలంకకు రాక
- ఇద్దరిది కోనసీమ, ఒకరిది పశ్చిమ.. అధికారులు అప్రమత్తం.. గాలింపు చర్యలు ముమ్మరం
- ఘటనా స్థలంలో గుండెలవిసేలా రోదిస్తున్న కుటుంబ సభ్యులు


కుమార్, సూర్యతేజ, ప్రవీణ్ (ఫైల్ ఫొటోలు)


ఒడ్డున వున్న దుస్తులు, చెప్పులు

ఆచంట, మే 27(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కమినిలంక వద్ద గోదావరిలో ఎనిమిది మంది యువకులు గల్లంతై మృత్యువాత పడిన ఘటన మరువక ముందే.. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం అయోధ్యలంక శివారు రావిలంక వద్ద గోదావరిలో మంగళవారం స్నానానికి దిగి ముగ్గురు బాలురు గల్లంతయ్యారు. ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. యలమంచిలి మండలం పెదలంకకు చెందిన నీతిపూడి పాల్‌కుమార్(15), కోనసీమ జిల్లా గన్నవరం మండలం నాగుల్లంకకు చెందిన కేతా ప్రవీణ్ (15), సానబోయిన సూర్యతేజ(12)తోపాటు మరో ఇద్దరు బాలురు గోదావరి నదీ పాయలో ఈత నేర్చుకుందామని రెండు కిలోమీటర్ల దూరంలోని రావిపాడుకు ఐదు రోజులుగా వస్తున్నారు. స్నానాలు చేస్తూ ఉల్లాసంగా గడిపారు. సరదా సరదాగా సాగుతుండగా మంగళవారం మధ్యాహ్నం ఊహించని ఉత్పాతం చోటు చేసుకుంది. వీరు స్నానాలు చేస్తుండగా కుమార్, ప్రవీణ్, సూర్యతేజ గల్లంతయ్యారు. 'కాపాడండి.. కాపాడండి' అంటూ వారు ఎంత అరిచినా అరణ్య రోదనే అయ్యింది. అక్కడే స్నానం చేస్తున్న మరో ఇద్దరు బాలురు ఈ దృశ్యాన్ని చూసి భయభ్రాంతులకు గురయ్యారు. ఏడుస్తూ ఒడ్డుకు చేరుకుని పరుగులు పెట్టారు. కాస్త దూరంలో పశువులు మేపుతున్న కొందరు రైతులు వీరిని చూసి విషయం తెలుసుకున్నారు. ఘటనా స్థలానికి చేరుకుని ఒడ్డున వున్న ప్రవీణ్ దుస్తుల్లోని సెల్‌ఫోన్ తీసుకుని అతని తండ్రి వెంకటేశ్వరరావుకు సమాచారం ఇచ్చారు. అతనిపాటు సూర్యతేజ తండ్రి ఏడుకొండలు, కుటుంబసభ్యులు, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

కుటుంబ సభ్యుల రోదనలు

- ఏడుకొండలు, దుర్గాభవాని దంపతులకు సూర్యతేజ ఒక్కడే కుమారుడు. ఇతను ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఏడుకొండలు వడ్రంగి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.
- వెంకటేశ్వరరావు, సరోజని దంపతులకు ప్రవీణ్ ఒక్కడే కుమారుడు. ఇతను పదో తరగతి పరీక్షలు రాశాడు. వెంకటేశ్వరరావు తాపీ మేస్త్రీ.
- కుమార్ తండ్రి నాని రోడ్డు ప్రమాదంలో మూడేళ్ల క్రితం మృతి చెందగా తల్లి మహాలక్ష్మి ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లింది. కుమార్‌కు సోదరి దుర్గాభవాని ఉంది. కుమార్ తల్లి గల్ఫ్ వెళ్లడంతో నానమ్మ సత్యవతి సంరక్షణలో ఉంటూ పదో తరగతి పరీక్షలు రాశాడు. వేసవి సెలవులు కావడంతో నెల రోజుల క్రితం బంధువులైన సూర్యతేజ ఇంటికి వచ్చాడు. అప్పటి నుంచి స్నేహితులతో కలిసి మెలిసి తిరిగి చివరకు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయ్యాడని కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

ఎస్పీ పరిశీలన

పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ ఎ.నయీంఅస్మి అక్కడకు చేరుకుని (మిగతా 6వ పేజీలో)

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ నయీం అస్మి తదితరులు






ఒకరోజు ముందే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

ఏలూరు సిటీ, మే 27(ఆంధ్రజ్యోతి):ప్రతీ నెలా ఒకటో తేదీన అందించే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను జూన్ నెలకు మే 31నే అందించనున్నారు. ఒకటో తేదీ ఆదివారం రావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. జిల్లాలో మొత్తం పింఛన్లు 2,59,685 ఉండగా రూ.112.98 కోట్లు లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉంది. ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు ఈ పింఛన్ మొత్తాలను ఆ రోజు ఉదయం 6గంటల నుంచే సచివాలయ సిబ్బందితో పాటు ఇతర ప్రభుత్వ సిబ్బంది పంపిణీ చేస్తారు. ఇక భర్త మరణిస్తే భార్యకు తక్షణం పింఛన్ మం జూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త వితంతు పింఛన్‌లను జూన్ 12వ తేదీన పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో 4,500 కొత్త వితంతు పింఛన్‌లకు దరఖాస్తులు వచ్చాయి.

పింఛన్ రకం	లబ్ధిదారులు	రూ.మొత్తం
అభయహస్తం	4,608	23,75,000
లాండ్‌లెస్‌పూర్	8	40,000
డప్పుకళాకారులు	2,032	81,68,000
విభిన్నప్రతిభావంతులు	33,086	20,10,36,000
మత్స్యకారులు	6,139	25,284,000
కళాకారుల పెన్షన్	163	6,72,000
వృద్ధాప్య	1,26,976	51,65,52,000
సైనికివెల్ఫేర్	15	75,000
సింగిల్ ఉమెన్	8,258	3,36,88,000
తలసేమియా	72	7,20,000
కల్లుగీత కార్మికులు	1,656	66,48,000
చర్మకారులు	1,691	67,64,000
ట్రాన్స్‌జెండర్	76	3,16,000
నేత కార్మికులు	1,115	45,00,000
వితంతు	68,513	28,04,40,000
సికెడియు (ప్రభుత్వ)	215	21,60,000
సికెడియు(ప్రైవేటు)	360	36,60,000
డిఎంఅండ్‌హెచ్‌ఓ	1,943	2,52,22,000
మొత్తం	2,59,685	1,12,98,16,000

పిల్లల జీవితాలతో ఆటలా..?

పేపర్ల కరెక్షన్ ఇలాగేనా ?



టెన్త్ జవాబుపత్రాల మూల్యాంకనం.. లోపాలు విద్యార్థులకు శాపమా ?

- రీవాల్యుయేషన్‌తోనే ప్రతిభకు న్యాయం

ఏలూరు అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి):ఈ ఏడాది జరిగిన టెన్త్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనంలో పలువురు విద్యార్థులు తమకు మార్కులు తక్కువగా రావడంతో సందేహించి రీవాల్యుయేషన్/రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి జవాబు పత్రాల జిరాక్స్ కాపీలతో సహా రీకౌంటింగ్ ఫలితాలను ఇటీవల పంపారు. పలువురికి రెగ్యులర్ పరీక్షల్లో వచ్చిన మార్కులకంటే ఎక్కువ రాగా, కొందరి విషయంలో జవాబులు సరైనవి కావని అర్థం వచ్చేలా రెడ్‌కలర్ పెన్‌తో నిలువునా కొట్టివేయాన్ని చూసి సంబంధిత విద్యార్థి, తల్లిదండ్రులు, స్కూలు టీచర్లు నివ్వెరపోయారు.

ఫెయిలైనవారు రీకౌంటింగ్‌లో పాస్.. జవాబులన్నీ కరెక్ట్‌గానే రాసినా మరీ ఇన్ని తక్కువ మార్కులేంటంటూ సందేహంతో రీవెరిఫికేషన్ చేయిం చుకున్న వారికి పదుల సంఖ్యలోనే మార్కుల్లో పెరుగుదల.. తాజాగా విద్యార్థి రాసిన జవాబులను పరిశీలించి మార్కులు ఇవ్వాల్సిన మూల్యాంకనంలోనే సరైన జవాబులకు కూడా మార్కులు వేయకుండా ఎడాపెడా ఎర్ర ఇంకుతో కొట్టివేతలు, దాటవేతలు.. ఇవన్నీ పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో నిర్లక్ష్యానికి నిలువుటద్దాలుగా నిలుస్తున్నాయి.

మూల్యాంకనానికి మూడు దశలున్నా..

జవాబుపత్రాల మూల్యాంకనం ప్రిన్సిపల్స్ ఆఫ్ వాల్యుయేషన్ మార్గదర్శకాల మేరకు జరుగుతుంది. అసిస్టెంట్ ఎగ్జామినర్ జవాబుపత్రాన్ని మూల్యాంకనం చేసిన తర్వాత ర్యాండమ్‌గా ఎగ్జామినర్ వాటిని పరిశీలించి ఆయా ప్రశ్నలకు మార్గదర్శకాలకనుగుణంగా మార్కులు వేసిందీ, లేనిదీ పరిశీలిస్తారు. ఈ క్రమంలోనే మూల్యాంకనం జరిగిన ప్రతీ జవాబు పత్రాన్ని స్క్రూటినైజర్ పరిశీలించి అసిస్టెంట్ ఎగ్జామినర్ జవాబుపత్రంలో నమోదుచేసిన మార్కులను లెక్కించి మూడు లేదా నాలుగు సెక్షన్లలో నిర్దిష్ట బాక్సులో ప్రశ్నల వారీగా నమోదు చేస్తారు. ఈ ప్రక్రియ యావత్తూ ముగ్గురు బాధ్యతాయుతమైన ఉపాధ్యాయుల మధ్య సమన్వయంతో జరుగుతుంది.

దీనికి బాధ్యులెవరు?

ఉంగుటూరు మండలంలోని ఒక రెవెన్యూ అధికారి కుమారుడు పదో తరగతి హిందీ సబ్జెక్టు జవాబుపత్రం రీకౌంటింగ్ నిమిత్తం దరఖాస్తు చేయగా, తుదిఫలితాల్లో అతనికి 58 నుంచి 70కి మార్కులు పెరిగాయి. ఏలూరు సమీపంలోని ఓ విద్యార్థినికి మిగతా అన్ని సబ్జెక్టుల్లో 90-95 మార్కుల చొప్పున రాగా, హిందీ సబ్జెక్టులో 49 మార్కులే వచ్చాయి. రీకౌంటింగ్/రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోగా జవాబుపత్రం జిరాక్స్ కాపీని విద్యార్థినికి ఇటీవల పంపించారు. మార్కుల పోస్టింగ్ పరిశీలించామని, 49 మార్కుల్లో పెరుగుదలకు అవకాశం లేదని స్పష్టంచేస్తూ దానిపై పేర్కొన్నారు. జవాబుపత్రం జిరాక్స్ కాపీని పరిశీలించిన హిందీ టీచర్లు, స్కూలు ఉపాధ్యాయులు ఆశ్చర్యపోయారు. పలు సరైన జవాబులను సైతం అసిస్టెంట్ ఎగ్జామినర్/ఎగ్జామినర్ అసలు చూడకుండా రెడ్‌కలర్ పెన్‌తో నిర్దాక్షిణ్యంగా కొట్టివేసి నట్టు గుర్తించారు. ఇలా 17, 20, 24 ప్రశ్నలకు సరైన జవాబు లనే విద్యార్థిని రాసినా పరిశీలించకుండానే కొట్టివేశారని, 21, 22, 23, 27, 28 ప్రశ్నలకు జవాబులను రాసినా జీరో మార్కులను ఇవ్వడాన్ని చూస్తే మూల్యాంకనం సరిగా జరగలేదని తెలుస్తోంది. నిబంధనల ప్రకారం జవాబుపత్రం ఎడమవైపున మార్కులు నమోదు చేయాల్సి ఉండగా కనీసం ఇదికూడా చేయలేదు. మూల్యాంకన సిబ్బంది లోపం ఎలావున్నా అంతిమంగా విద్యార్థిని రాసిన జవాబులకు సరైన మార్కులను పొందేందుకు జవాబు పత్రం రీవాల్యూయేషన్‌కు అవకాశం లేదని ఎస్ఎస్‌సీ బోర్డు నుంచి అందిన జిరాక్స్ కాపీ ముందుభాగాన పేర్కొనడం ఆటవిక శాసనాలను గుర్తుచేస్తోందని వాపోతున్నారు. రీవాల్యూయేషన్‌కు బోర్డు పెట్టుకున్న నిబంధనలను సడలించి ప్రత్యేక కేసుగా అనుమతిస్తే ఈ విద్యార్థినికి కనీసం మరో 35-40 మార్కులు రావడం ఖాయమని తెలుస్తోంది.

అయ్యో ! ఇంత అన్యాయమా?

పెరవలి మండలానికి చెందిన ఓ విద్యార్థినికి సోషల్ స్టడీస్ పరీక్షలో 34 మార్కులే వచ్చాయి. రీకౌంటింగ్/రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా నిబంధనల మేరకు ఆన్సర్‌షీటు జిరాక్స్ కాపీని పంపారే తప్ప ఒక్క మార్కూ పెరగలేదు. జవాబుపత్రం జిరాక్స్ కాపీని చూడగా, (మిగతా 6వ పేజీలో)

ముగిసిన ఈఏపీ సెట్

ఏలూరు అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఈఏపీ కామన్ ఎంట్రన్స్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఇంజనీరింగ్ ప్రవేశాలకు జరుగుతున్న ఆన్‌లైన్ పరీక్షల్లో భాగంగా చివరిరోజున స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో 158 మంది, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కేంద్రంలో 144, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 165 మంది హాజరయ్యారు. మొత్తం మీద ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలకు జిల్లాలో 6,875 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 6,602 మంది హాజరయ్యారు.

ఒకటి నుంచి రేషన్ షాపుల్లో నిత్యావసర సరుకులు : జేసీ

ఏలూరు సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు సరఫరాకు సర్వసన్నద్ధంగా ఉండాలని జేసీ ధాత్రిరెడ్డి రేషన్ డీలర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో డీలర్లకు, పౌరసరఫరాల డీటీలకు జూన్ 1వతేదీ నుంచి రేషన్ షాపుల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ విషయంపై మంగళవారం సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 1,123 డీలర్లు వారి దుకాణం వద్ద అందరికీ కనిపించేలా స్టాక్ బోర్డు ప్రదర్శించాలన్నారు. జిల్లాలో మొత్తం 1,123 రేషన్ దుకాణాలు, 13 ఆఫ్‌లైన్ దుకాణాలు ఉన్నాయన్నారు. చౌకధర దుకాణాలను పూలతో అలంకరించి పండుగ వాతావరణంలో స్థానిక ప్రజా ప్రతినిధులతో, సీనియర్ సిటిజన్స్‌తో పునఃప్రారంభించాలన్నారు. రేషన్ డిపోల వద్ద సీసీటీవీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అన్ని రేషన్ షాపుల వద్ద ఈనెల 29న ట్రయల్ రన్ నిర్వహించుకోవాలన్నారు. డీఎస్‌వో శివరామమూర్తి ఇతర అధికారులు పాల్గొన్నారు.



మహానాడు సంబరం



కడప గడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్యక్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలాది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాండ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను, ఫ్లెక్సీలను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండోరోజు మహానాడు కోసం అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.







యోగా దినచర్యలో భాగమవ్వాలి

ఏలూరులో యోగాంధ్ర ర్యాలీ ప్రారంభించిన కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరూ యోగాను దినచర్యగా చేసుకోవాలని, యోగా అభ్యాసన మానవాళికి సంజీవిని వంటిదని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళ వారం ఏలూరు ఇండోర్ స్టేడియం నుంచి నిర్వహించిన యోగాంధ్రపై ప్రత్యేక ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఇండోర్ స్టేడియం నుంచి ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు, అక్కడి నుంచి కొత్త బస్టాండ్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో అన్నివర్గాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రతీఒక్కరూ యోగాను దినచర్యగా చేసు కోవడం మూలంగా ఆరోగ్యం సిద్ధించడంతో పాటు మానసిక వికాసం కలుగుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు గ్రామ, మండల, జిల్లాస్థాయిలో యోగాపై అవ గాహన కలిగించే కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. జిల్లాలో ఇప్పటికే యోగాభ్యాసన కార్యక్రమాల నిర్వహణకు సుమారు 400 మంది మాస్టర్ ట్రైనీలను సమ కూర్చామన్నారు. అదేవిధంగా జిల్లాలో 5 వేల మందికి యోగా శిక్షణ అందించేందుకు రాష్ట్రప్రభుత్వం ద్వారా ఐదు రోజుల పాటు ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తామ న్నారు. జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ యోగాకు సంబంధించి వివిధ స్థాయిల్లో పలు పోటీలను నిర్వహి స్తున్నామని, గ్రామస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు మండల, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వర రావు, ఆయూష్ ఆర్‌డీడీ సుభద్ర, ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ భానుప్రతాప్, ఎల్‌డీఎం నీల్యాద్రి, డీసీవో ఆరిమిల్లి శ్రీనివాస్, డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీఎస్‌డీవో శ్రీనివాసరావు, ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ సూపరిం టెండెంట్ జి.పాండు రంగారావు, ఏలూరు తహసీల్దార్ జీవీ శేషగిరిలు పాల్గొన్నారు.



నరసాపురంలో సామూహిక ధ్యానం



ఏలూరులో ర్యాలీలో కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

గోదావరి తీరాన సామూహిక యోగా

నరసాపురం టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): గోదావరి తీరాన మంగళవారం యోగా సందడి నెలకొంది. అంత ర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా పట్టణంలోని వలంథర్ రేవులో యోగాంధ్ర ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక యోగాలో ప్రభుత్వ విప్ నాయకర్, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవో దాసిరాజు, డీఎస్పీ శ్రీవేద, డీఆర్వో వెంకటేశ్వర్లులతో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రముఖులు పాల్గొని ధ్యానం, యోగాసానాలు చేశారు. గోదావరిలో ఏర్పాటు చేసిన పడ వలపై యోగాసానాలు వేశారు. అనంతరం విప్ నాయకర్ మాట్లాడుతూ దీర్ఘకాల వ్యాధుల్ని దూరం చేసే శక్తి యోగాకే ఉందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ఒత్తిడిని జయించాలంటే విధిగా రోజులో కనీసం 15 నిమిషాలైనా యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటామన్నారు. జేసీ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ యోగా వల్ల శరీర ధృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత సాధ్య మవుతుందన్నారు. వచ్చేనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున జిల్లాలో కనీసం 10 లక్షల మంది యోగాలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కమిషనర్ అంజయ్య, ఎంపీడీవో రామకృష్ణం రాజు, తహసీల్దార్ సత్యనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.



ఖాళీగా శ్రీవారి దర్శనానికి వెళ్లే క్యూలైన్లు

శ్రీవారి ఆలయ భక్తుల రద్దీపై అమావాస్య ఎఫెక్ట్

ద్వారకాతిరుమల, మే 27 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీపై అమావాస్య ప్రభావం చూపింది. ఆలయానికి ప్రతీరోజు వేలాదిగా తరలివచ్చే భక్తులు అమావాస్య కారణంగా, అలాగే రానున్నది జ్యేష్ఠమాసం కావడంతో తక్కువ సంఖ్యలో క్షేత్రానికి విచ్చేశారు. ఆలయంలోని అన్ని విభాగాలు సాధారణ భక్తుల రద్దీతో కనిపించాయి. భక్తులు క్యూలైన్లలో వెళ్లి స్వామి, అమ్మ వార్లను దర్శించుకున్నారు. తరువాత స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

వామ్మో..లింగంపల్లి!

రిజర్వేషన్ లేకపోతే ప్రయాణం అవస్థే
జనరల్ కోసం ఉదయం నుంచే క్యూలో పడిగాపులు
గతంలో సికింద్రాబాద్‌కు రెండు రైళ్లు
నాగర్‌సోల్ రూటు మార్చడంతో
లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌కు డిమాండ్

నరసాపురం, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆ రైలుకు ఉండే డిమాండ్ వేరు. హైద్రాబాద్ వెళ్లాలంటే జిల్లావాసులు ముందుగా ఎంచుకునేది లింగంపల్లి ఎక్స్ ప్రెస్సే.. అందుకే ఈ రైలు ఎప్పుడూ రద్దీగా కనిపిస్తుంది. రిజర్వేషన్ చేయించు కోవాలంటే నెల ముందుండాలి. సీజన్‌లో అయితే రెండు నెలలైనా దొరకని పరిస్థితి. ఇక జనరల్ బోగీల్లో సీటు కావాలంటే ఉదయం నుంచి క్యూలో ఉండాల్సిందే. లేకపోతే బోగీ ఎక్కడం కష్టమే. ప్రస్తుతం ఈ డిమాండ్ మరింత పెరిగి పోయింది. కారణం నరసాపురం నుంచి నాగర్‌సోల్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రూట్‌ను మార్చడమే. గతంలో ఈరైలు ఉదయం పూట బయలు దేరి సికింద్రాబాద్ మీదుగా వెళ్లేది. ప్రస్తుతం దీన్ని రూట్ మార్చారు. చర్లపల్లి మీదుగా వెళ్తుతుంది. దీంతో సికింద్రా బాద్‌లో దిగి కుకట్‌పల్లి, అమీర్‌పేట, బిహెచ్‌ఈఎల్, ఎస్‌ఆర్ నగర్, బాలనగర్, సనత్‌నగర్ వైపు వెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. చర్లపల్లి దిగి రాత్రి సమయాల్లో హైద్రాబాద్‌లోని ఈ ప్రాంతాలకు వెళ్లాలంటే సిటీ బస్సులు చిక్కడం లేదు. క్యాబ్‌లు, ఆటోలకు రూ.1000 వరకు ఖర్చు అవుతుంది. దీంతో కుకట్‌పల్లి, బీహెచ్‌ఈఎల్ వైపు వెళ్లే ప్రయా ణికులు లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌ను ఎంచు కుంటున్నారు.





లింగంపల్లి రైలు ఎక్కేందుకు ప్రయాణికులు క్యూలో పెట్టుకున్న లగేజీ బ్యాగ్‌లు

రిజర్వేషన్ లేకపోతే సీట్లు దొరకవన్న భయంతో ఉదయం 8 గంటల నుంచే స్టేషన్‌కు వచ్చేస్తున్నారు. ప్రయాణి కులకు సంబంధించిన లగేజీని ఒకరికి ఇచ్చి స్టేషన్‌కు పంపిస్తున్నారు. అప్పటి నుంచి ఆ లగేజీని క్యూలైన్‌లో పెట్టి సాయంత్రం 7 గంటల వరకు నిరీక్షిస్తున్నారు. దీంతో మధ్యాహ్నం 12 అయితే చాలు స్టేషన్‌లో లగేజీ క్యూ బయటవరకు దర్శనమిస్తుంది. ఇక సెలవు రోజుల్లో అయితే ఈ క్యూ మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ఈ రైలుకు మూడు జనరల్ బోగీలు మాత్రమే ఉన్నాయి. తాజాగా మరో బోగీ వేస్తామని ప్రకటించారు. అయినా ప్రయా ణికుల డిమాండ్‌కు ఆ బోగి సరిపోదన్న వాదనలు వినిపిస్తున్నాయి. పగటి పూట జిల్లా మీదుగా హైద్రాబాద్‌కు మరో రైలును నడిపితే గానీ ఈ డిమాండ్ తగ్గదన్న వాదనలు వ్యక్తమవుతున్నాయి.

పోషకాల నేరేడు



మార్కెట్‌ను ముంచెత్తుతున్న నేరేడుపండ్లు
రెండునెలలు పలువురికి జీవనోపాధి

గణపవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ఫలదాయిని పుష్కలంగా పోషకాలు ఉన్న నేరేడుపండ్లు మార్కెట్‌లో ముంచెత్తుతున్నాయి. ఈ నోరూరించే నేరేడుపండ్లు మార్కెట్‌లో దర్శ నమిస్తున్నాయి. రహదారుల వెంబడి విక్ర యాలు సాగిస్తున్నారు. ఈ సీజన్‌లో దొరికే పండ్లతో పాటు పోషకాల్లో రారాజుగా ఖ్యాతి చెందిన నేరేడుపండ్లు కూడా ఎంతో ప్రాధాన్యత ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో కాల్వ, చెరువుగట్లు, పుంతలు, రహదారుల వెంబడి నేరేడుచెట్లు దర్శనమిస్తుంటాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు ప్రస్తుతం గణపవరం మార్కెట్‌లో నేరేడుపండ్లు ముంచెత్తుతున్నాయి. పలువురికి జీవనోపాధిగా ఉపయోగపడు తోంది తోపుడు బండ్లపైన గంపల్లోనూ యువ కులు, మహిళలతో సహా ఈ విక్రయాలు నిర్వహిస్తున్నారు. కిలో రూ.180 నుంచి రూ.280 వరకు విక్రయిస్తున్నారు. రాజమండ్రి, విజయవాడ, తెలంగాణలోని పలు జిల్లాల నుంచి కూడా వ్యాపారులు మార్కెట్‌కు తరలివచ్చి విక్రయాలు సాగిస్తున్నారు. నేరేడు పండ్లు తినడం వల్ల అనేక ప్రయోజనాలున్నా యని ముఖ్యంగా మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఎంతో ఉపయో గపడుతున్నాయని వైద్యులు చెబుతున్నారు.



గణపవరంలో నేరేడు పండ్ల విక్రయాలు

• ఆరోగ్య ప్రయోజనాలు పుష్కలం



మధుమేహ వ్యాధి నివారణకు దివ్య ఔషధం. రక్తంలో చక్కరశాతాన్ని నియంత్రిస్తుంది. గింజలు ఎండబెట్టి పొడిచేసి తీసుకోవడం వల్ల షుగర్ వ్యాధి అదుపులో ఉంటుంది. నేరేడు పండ్లలో పోటాషియం, సోడియం, కాల్షియం, మాంగనీసు, జింకు, ఫాస్పరస్ లభిస్తాయి. యాంటీ ఆక్సిడెంట్లు కాలేయ పనితీరు మెరుగుపరుస్తాయి. నోటిచిగుర్లు ధృడంగా ఆరోగ్యంగా ఉండేలా చూస్తాయి. విటమిన్ ఏ, సీతో పాటు రైబో ఫ్లోవిన్, పోలీక్ ఆమ్లం ఎక్కువగా ఉంటాయి. అధిక రక్తపోటు నియం త్రిస్తుంది. గుండె ఆరోగ్యం మెరుగు పరుస్తుంది. రక్తంలోని హిమో గ్లోబిన్ శాతం పెంపొంది స్తుంది. హృదయ సంబంధ వ్యాధులు తగ్గి స్తుంది. జీర్ణశక్తి మెరుగు చేస్తుంది. మల బద్ధకం, మూత్ర సంబంధ వ్యాధులు కూడా తగ్గుతాయి. కీళ్లనొప్పులు తగ్గి చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

- ప్రభుత్వ వైద్యాధికారి కిరణ్మయి, గణపవరం

• రెండు నెలల పాటు జీవనోపాధి



రెండు నెలలపాటు నేరేడు పండ్ల విక్రయాలు జీవనోపాధిగా ఉపయో గపడతాయి. గ్రామీణ ప్రాంతాల్లోని చెట్ల నుంచి పండ్లు పండ్లు కోసి విక్రయిస్తుంటారు. రాజమండ్రి, విజయవాడ, ఏలూరు, చిత్తూరు జిల్లా మదనపల్లి, పలమనేరు, తెలంగాణ ప్రాంతాల నుంచి కూడా వ్యాపారులు కొనుగోలు చేసుకుని విక్రయిస్తుంటారు. జూన్, జూలై వరకు కూడా నేరేడుపండ్లు పుష్కలంగా లభిస్తాయి. కిలో రూ.180-200 వరకు విక్రయిస్తున్నాం.

- గోపాలం, పండ్ల వ్యాపారి గణపవరం

వైద్యులు కావాలి

తణుకులో పేరుకే జిల్లాస్థాయి ఆసుపత్రి

- ఆసుపత్రి స్థాయికి తగినట్టుగా వైద్యులు నిల్
- పెరగని పారిశుధ్య కార్మికుల సంఖ్య
- రోగులకు తప్పని ఇబ్బందులు
- కొత్త భవనాల నిర్మాణానికి రూ.19.2 కోట్లతో ప్రతిపాదనలు


తణుకులో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి

తణుకు, మే 27(ఆంధ్రజ్యోతి): తణుకులో పేరుకే జిల్లాస్థాయి ఆసుపత్రి. ఆసుపత్రిస్థాయికి తగ్గట్టుగా వైద్యుల నియామకం లేదు. కీలక విభాగాలకు వైద్యులు అందుబాటులో లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలో కీలకమైన ఆర్‌ఎంవో పోస్టు కొన్నేళ్ల నుంచి ఖాళీగానే ఉంటుంది. పలు విభాగాలకు సంబంధించి 34 మంది ఉండాల్సింది.. 29మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇంకా ఐదుగురు వైద్యులకు సంబంధించి విభాగాలు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నాయి. ప్రతిరోజు కనీసం నాలుగు వందల మంది రోగులు ఆయా విభాగాలకు వచ్చి సేవలు పొంది వెళుతుంటారు. ఇన్‌పేషెంట్లు 150నుంచి 200 వరకు వార్డుల్లో సేవలు పొందుతున్నారు. వైద్యుల కొరతతో ఆయా విభాగాలకు సంబంధించిన వందల సంఖ్యలో రోగులు వచ్చి తిరిగి వెళ్లిపోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

భర్తీ చేయాల్సిన వైద్యులు వీరే :

జిల్లా ఆసుపత్రి స్థాయిలో మొత్తంగా 34 మంది వైద్యులకు గాను 29మంది పనిచేస్తున్నారు. ఇంకా ఐదుగురిని నియమించాలి. వాటిలో సివిల్ సర్జన్ ఆర్‌ఎంవో-1, డిప్యూటీ సివిల్ సర్జన్ స్పెషల్ ఎనస్తీషియా-1, డిప్యూటీ సివిల్ సర్జన్ జనరల్-1, డిప్యూటీ సివిల్ సర్జన్ జనరల్-2 రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సివిల్ అసిస్టెంట్ సర్జన్ జనరల్ మెడిసిన్-1, సివిల్ అసిస్టెంట్ సర్జన్ గైనకాలజీ-1, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పీడియాట్రిక్-1, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పలమనాలజిస్టు-1, డార్కు రూమ్ అసిస్టెంట్‌లు మూడు పోస్టులకు గాను రెండు ఖాళీగా ఉంటే ఒకటి అనధికార సెలవులో ఉండడంతో మొత్తంగా మూడు ఖాళీగా ఉన్నాయి. ఆడియో మెట్రిషన్-1, జూనియర్ అసిస్టెంట్-1, సీనియర్ అసిస్టెంట్-2 ఖాళీగా ఉన్నాయి.

కొలిక్కిరానున్న బ్లడ్‌బ్యాంకు ..

జిల్లా ఆసుపత్రిగా ఉన్నందున బ్లడ్ బ్యాంకు సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. తొలుత పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతి పొందియున్నారు. భవనాలను సిద్ధం చేశారు.

ఇక మిగిలింది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన బృందాలు వచ్చి పరిశీలించాల్సి ఉంది. ఆసుపత్రికి అవసరమైన పారిశుధ్య కార్మికులు కొరత వేధిస్తుంది. ఏరియా ఆసుపత్రిగా ఉన్నప్పుడు వందపడకల ఆసుపత్రికి 19మందితో విధులు నిర్వహిస్తారు. ఇప్పుడు 150 పడకల ఆసుపత్రిగా స్థాయి పెరిగింది. కాని పారిశుధ్య కార్మికుల సంఖ్య పెరగలేదు.

రూ.19.2 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

తణుకు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో రూ.19.2 కోట్లతో పలు అభివృద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. వాటిలో ప్రధానంగా కొత్త భవనాల నిర్మాణానికి 16వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. త్వరలోనే నిధులు వచ్చే అవకాశం ఉంది. అయితే స్థలం సమస్య వెంటాడుతోంది. అవసరానికి తగిన ట్టుగా భవనాలు లేక పోవడంతో పాత భవనాలు తొలగించి వాటిస్థానంలో కొత్త భవనాలు నిర్మించేలా ప్రతిపాదనలు చేస్తున్నట్టు చెబుతున్నారు.

మానసిక వైద్య సేవలు నిలిపివేత

తణుకు : తణుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతినెలా నిర్వహించే మానసిక రోగుల శిబిరం నిలిపివేశారు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్నపుడు ఏలూరు ప్రభుత్వాసుపత్రి నుంచి నెలలో ఒక రోజు వచ్చి తణుకు ఆసుపత్రిలో రోగులకు సేవలందించే వారు. నెలకు సరిపడా మందులు ఉచితంగా అందజేసే వారు. కొన్ని నెలలుగా మానసిక రోగులకు వైద్య సేవలు అందడం లేదు. జిల్లాల విభజన తర్వాత ఏలూరు జిల్లా ప్రాతిపదికన వైద్యులను నియమించారు. అప్పటి నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు అందించే సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. జిల్లా మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ అనేది పూర్తిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేస్తుంది. దీనిపై అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో సుమారుగా రెండు వేల మంది మానసిక రోగులు ఉన్నట్టు చెబుతున్నారు.

గతంలో ఇలా..

గతంలో డిస్ట్రిక్ట్ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ ద్వారా వైద్యులు ఎప్పుడు వచ్చేది సమాచారం అందించేవారు. ఆయా గ్రామాల పరిధిలో ఉన్న పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు వెళ్లి అక్కడ వైద్యుని సమక్షంలో పరీక్షలు జరిపి మందులు ఇచ్చే పరిస్థితులు ఉండేది. ప్రధానంగా పిట్స్, ఆల్కహాలు, స్మోకింగ్, డ్రగ్స్, పిచ్చి, యాంగ్జైటీ, డిప్రెషన్ వంటి రోగాలతో పాటు 30 రకాలు జబ్బులుకు పరీక్షలు చేసి మందులు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ విధంగా జరగడం లేదు. అఖిల భారత దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షుడు కట్టా సతీశ్ మాట్లాడుతూ మానసిన రోగుల కోసం నిర్వహించే వైద్యసేవలు వెంటనే పునరుద్ధరణ చేయాలని, దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలన్నారు.

వైద్యులను నియమించాలి



జిల్లా ఆసుపత్రి స్థాయిలో ఇంకా సేవలందించడానికి వీలుగా కొంతమంది వైద్యులను నియమించాల్సి ఉంది. ప్రభుత్వం దృష్టిలో పెట్టాం. త్వరలో వైద్యులను నియమిస్తామని చెప్పారు. మిగిలిన మౌలిక సదుపాయాలు, భవనాలు నిర్మాణాలకు ప్రతిపాదనలు ఉన్నాయి. మానసిక రోగులకు సేవలందించే వైద్యులు రెండు నెలలుగా రావడం లేదు. దీనివల్ల అందరూ ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది.

– డాక్టర్ వెలగల అరుణ, ఆసుపత్రి సూపరింటెండెంట్

• ట్రీట్‌మెంట్ చేయాలి


తాడేపల్లిగూడెంలో నిర్మాణంలో ఉన్న భవనం ముందు పెరిగిన తుప్పలు

నిర్లక్ష్యం

పడకేసిన తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి భవనాల నిర్మాణం

కాంట్రాక్టర్ అలసత్వంతో సాగని పనులు

తాడేపల్లిగూడెం రూరల్, మే27 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యం కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నీరుకారుతోంది, టీపీగూడెం ఏరియా ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చేందుకు గతంలో ప్రతిపాదించిన గత ప్రభుత్వం ఆ ఆసుపత్రి నిర్మాణానికి నిధులు కేటాయించింది. ఆ పనులకు రూ.11.22 కోట్లతో 2021లో అప్పటి ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ భూమి పూజ చేశారు. ఆ తరువాత పనులు ప్రారంభించినా బిల్లులు రావడంలేదని కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ముందుకు కదలలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బిల్లులు విడుదల చేయించి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఈ పనుల వేగం పెంచాలని అధికారులు, కాంట్రాక్టర్‌లకు సూచించారు.

అధికారులపై ఎమ్మెల్యే బొలిశెట్టి ఆగ్రహం

ప్రస్తుత ప్రభుత్వంలో ఒకనెల పనులు చేసి తరువాత కాంట్రాక్టర్ వాటిని వదిలేశారు. ఆ భవనం చుట్టూ తుప్పలు పేరుకుపోయాయి. గతంలో నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సలహా సంఘ సమావేశంలో పనులపై ఆరా తీసి కాంట్రాక్టర్ పనులు చేయకపోతే చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశించారు. పనులు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో మంగళవారం జరిగిన ఆసుపత్రి సలహా సంఘ సమావేశంలో అధికారులపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో మూడు నెలల్లో పనులు పూర్తికాకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

త్వరలో పనులు పూర్తవుతాయి



భవన నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. కాంట్రాక్టర్ ప్లంబింగ్, వైరింగ్, డోర్లు తదితర పనులు పూర్తి చేయాల్సి ఉంది. త్వరలో పనులు పూర్తిచేయించేందుకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దృష్టి సారించారు.

– డాక్టర్ తాతారావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, తాడేపల్లిగూడెం

జూన్ 2న వికసిత్ కృషి సంకల్ప అభియాన్

తాడేపల్లిగూడెం రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర వ్యవసాయశాఖ, రైతు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే 'వికసిత్ కృషి సంకల్ప అభియాన్' కార్యక్రమం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జూన్ 2న తాడేపల్లిగూడెం మండలం పట్టింపాలెంలో ప్రారంభిస్తామని ఉపకులపతి డాక్టర్ గోపాల్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభిస్తారని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి నూతన పరిజ్ఞానం రైతులకు అందించే విధంగా కృషి చేస్తారన్నారు.

హెచ్‌ఎం పదోన్నతి అర్హులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

ఏలూరు అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో వున్న ఏలూరు, భీమవరం, తూర్పుగోదావరి జిల్లాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయుల్లో అర్హులైన వారికి గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక సిద్ధార్థ స్కూలులో నిర్వహించిన ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరుకాని 41 మంది జడ్పీ, ఐదుగురు మున్సిపల్ ఉపాధ్యాయులు ఈనెల 28న ఏలూరు డీఈవో కార్యాలయానికి ఉదయం పది గంటలకు హాజరై సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆదేశించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు మంగళవారం 282 మంది జడ్పీ యాజమాన్య స్కూల్ అసిస్టెంట్లు హాజరు కావాల్సి ఉండగా 241 మంది, మున్సిపల్ యాజమాన్యం నుంచి 22 మంది హాజరు కావాల్సి ఉండగా 17 మంది హాజరయ్యారని వివరించారు.

ఉచిత న్యాయ సహాయం అందిస్తాం


జిల్లా జైలులో ఆహార పదార్థాలను రుచి చూస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు క్రైం/ చింతలపూడి, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఖైదీలకు వారి కుటుంబ సభ్యులకు ఎటువంటి న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచితంగా అందిస్తుందని సద్వి నియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. మంగళవారం ఏలూరులో జిల్లా కారాగారాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. కారాగారంలో ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలపై ఎప్పటికప్పుడు తనిఖీ చేసి సంబంధిత అధికారులకు సూచనలు చేయాల్సిన బాధ్యత జిల్లా న్యాయ సేవాధికార సంస్థపై ఉందన్నారు. ఆర్థికంగా వెనుకబడి, న్యాయవాదిని నియమించుకోలేని ఖైదీలకు ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామని తెలిపారు. అనంతరం పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక దాడులను నిరోధించేందుకు చింతలపూడి కోర్టు ప్రాంగణంలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు.


స్థలాలను పరిశీలిస్తున్న ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అభిషేక్

నిర్వాసితులకు పశ్చిమ ఏజెన్సీలో భూములు

- పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అభిషేక్

బుట్టాయగూడెం, మే 17(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల నిర్వాసితులుగా మారుతున్న చింతూరు ఐటీడీఏ పరిధిలోని గిరిజనుల కోసం పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో భూముల సేకరిస్తున్నట్టు ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ వి.అభిషేక్ తెలిపారు. మంగళవారం బుట్టాయగూడెం వచ్చిన ఆయన రెవెన్యూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా పోలవరం ప్రాజెక్టు ఫేజ్-1(బి)లో 2022లో గోదావరికి వచ్చిన వరదల కారణంగా చింతూరు ఐటీడీఏ పరిధిలోని 32 గిరిజన గ్రామాలకు చెందిన 13,700 మంది ముంపునకు గురై నిర్వాసితులుగా మారారని తెలిపారు. చింతూరు ఐటీడీఏ పరిధిలో 48 గ్రామాలు వరదల ప్రభావానికి గురికాగా 32 గ్రామాల ప్రజలను తరలించేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ ఆదేశాల మేరకు మంగళవారం బుట్టాయగూడెం మండలంలోని రెడ్డిగణపవరం ప్రాంతంలోని భూములను చూసుకోడానికి 38 మంది నిర్వాసితులు ఆర్టీసీ బస్సులో వచ్చినట్టు తెలిపారు. వ్యవసాయానికి అనుకూలమైన భూములనే నిర్వాసితులకు చూపుతున్నామని, గిరిజనులు రాతపూర్వకంగా అంగీకరిస్తేనే కొనుగోలు చేస్తామన్నారు. రెవెన్యూ అధికారులు దగ్గరుండి నిర్వాసితులకు భూములను చూపిస్తారని ముఖాముఖిగా వారితో మాట్లాడి అంగీకారం తెలిపిన తరువాతే చర్యలు చేపడతామన్నారు. చింతూరు ఐటీడీఏ పరిధిలో భూములు కోల్పోతున్న గిరిజనులందరికీ రెండున్నర ఎకరాల భూమిని ఇవ్వనున్నట్టు తెలిపారు. నిర్వాసితుల అంగీకారం మేరకు ప్రభుత్వ ఆదేశాలతో ఇక్కడ కాలనీలు నిర్మించి భూములు కొనుగోలు చేసి ఇస్తామన్నారు. నిర్వాసితులకు బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, రంపచోడవరం ప్రాంతాల్లో కాలనీల ఏర్పాటుకు, భూముల కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామని వారికి నచ్చిన చోట భూములు ఇస్తామని తెలిపారు. ఈ ప్రక్రియ ఒక్కరోజులో ముగియదని సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నెల రోజుల పాటు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం.వి.రమణ, తహసీల్దార్ పి.వి.చలపతిరావు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో పరిశుభ్రత పాటించాలి : కలెక్టర్ వెట్రిసెల్వి


ఏలూరు కొత్త బస్టాండ్‌లో తనిఖీ చేస్తున్న కలెక్టర్

ఏలూరు క్రైం, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ఆర్టీసీ బస్టాండ్‌లో మరింత పరిశుభ్రత చోటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. మంగళవారం ఏలూరు కొత్త బస్టాండ్‌ను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏలూరు బస్టాండ్‌లోని ప్లాట్‌ఫాంలను పరిశీలించారు. బస్టాండు పిల్లర్లపై ఉన్నటువంటి బస్సుల సమయ వేళలను తనిఖీ చేశారు. పలుస్టాల్స్‌ను సందర్శించి తినుబండారాల ప్యాకెట్లపై తయారీ, ముగింపు తేదీలను పరిశీలించారు. అనంతరం విచారణ కేంద్రాన్ని సందర్శించారు. బస్టాండ్‌లోని క్యాంటీన్‌కు వెళ్లి వంటశాలలో ఆహారపదార్థాల తయారీ విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా మరుగుదొడ్ల పరిశుభ్రతని పరిశీలించి, బస్టాండ్ శుభ్రతకి ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు అందించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శ్రీసత్యసాయి వాటర్ ప్లాంట్‌ని సందర్శించారు. కండక్టర్లు వాడుతున్న టిమ్ మిషన్ల ద్వారా యూపీఐ పేమెంట్ జరుగుతున్నాయా అని అడిగి వారికి సూచనలు అందించారు. త్వరలో మళ్లీ బస్టాండ్ తనిఖీకి వస్తానని అప్పటికి మరిన్ని మెరుగైన సౌకర్యాలు అందించే విధంగా చూడాలన్నారు.

విజయవంతంగా ఉపాధి పథకం

- ఏలూరు జిల్లా డ్వామా పీడీ సుబ్బారావు



ఏలూరు సిటీ, మే27(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం విజయవంతంగా జరుగుతోందని డ్వామా పీడీ కె.వెంకట సుబ్బారావు తెలిపారు. ఏలూరు డ్వామా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో జిల్లాలో ఉపాధి పథకం అమలు తీరును వివరించారు. 'జిల్లాలో గతేడాది కోటి 23లక్షల 65వేల పనిదినాలు కల్పించి 103 శాతం పైగా వృద్ధిని సాధించాం. గతంలో ఉపాధి హామీ వేతనం సరాసరి రూ.300 కాగా దానిని ప్రభుత్వం రూ.307లకు పెంచింది. ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించిన పనులకు సంబంధించి ప్రస్తుతం రూ.280 సరాసరి వేతనం చెల్లించాం. ఏప్రిల్, మే, జూన్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో పనులు ఎక్కువ చేపట్టేలా ప్రణాళిక రూపొందించాం. ఉద్యాన పంటల విస్తరణకు సంబంధించి గతేడాది 3,150 ఎకరాలు లక్ష్యంగా తీసుకోగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సూచనల మేరకు ఐదు ఎకరాలు, ఆలోపు ఉన్న చిన్నసన్న కారు రైతులకు సంబంధించి ఉద్యాన పంటలకు ఉపాధి హామీ అనుసంధానం చేసేందుకు చర్యలు చేపట్టాం. గతేడాది ఉపాధి హామీ పనులు ఎక్కువ చేపట్టటం మూలంగా రూ. 200 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ కింద జిల్లాకు లభించింది. తప్పుడు మస్టర్ నమోదు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సోమవారం నూజివీడు మండలంలో జిల్లా విజిలెన్స్ అధికారి, అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి సంయుక్తంగా విచారణ చేసేందుకు ఆదేశించాం.' అని వివరించారు.

క్రైం సమాచారం

వివాహిత అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, మే 27(ఆంధ్రజ్యోతి):ఒక వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందని ఆ ప్రాంత వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏలూరు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. ఏలూరు-సత్రంపాడులోని నెహ్రూకాలనీ 8వ రోడ్డులోని గుండబత్తుల మురళీ ఇంట్లో బొర్రా శ్రీమహాలక్ష్మి(30) అద్దెకు ఒంటరిగా ఉంటుంది. ఆటో డ్రైవర్ కె.పవన్‌కుమార్ అనే యువకుడితో సహజీవనం చేస్తుందని చెబుతున్నారు. ఆమె ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండడంతో స్థానిక వీఆర్వో దుర్గారావు మంగళవారం ఉదయం ఫిర్యాదు చేశారు. సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

బీచ్‌లో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మొగల్తూరు, మే27 (ఆంధ్రజ్యోతి): పేరుపాలెం సాగరతీరంలో ఈనెల 25న స్నానానికి దిగి గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైనట్టు మొగల్తూరు పోలీసులు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం చిన్నాయిగూడెంకు చెందిన వేదాలు అజయ్(25) ఈనెల 25న పేరుపాలెం తీరానికి తన స్నేహితులతో వచ్చి సముద్ర స్నానానికి దిగి గల్లంతైన విషయం విదితమే. అజయ్ మృతదేహం నరసాపురం మండలం వేములదీవి సాగరతీరానికి కొట్టుకువచ్చిందన్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి మృతిని కుటుంబ సభ్యులకు అప్పగించామని పోలీసులు తెలిపారు.

ఊరెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ

- రూ.12 లక్షల విలువైన బంగారం, నగదు అపహరణ

ఏలూరు క్రైం, మే 27 (ఆంధ్రజ్యోతి) : పిల్లల చదువుల నిమిత్తం కాలేజీ చూసిరావడానికి వెళ్లేందుకు ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా ఊరువెళ్లి తిరిగి వచ్చేసరికి దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి సుమారు రూ.12 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, వివిధ వస్తువులు, నగదు అపహరించుకుపోయారు. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతం రాజరాజేశ్వరినగర్ రెండో రోడ్డులో నివాసం ఉంటున్న పడవల వెంకటశ్రీనివాసరావు కాకినాడకు చెందిన ఏపీ ట్రాన్స్‌కో ప్రాజెక్టు మేనేజర్‌గా ప్రైవేట్ కన్సల్టెన్సీ కామవరపుకోట విభాగంలో పనిచేస్తున్నారు. ఆయన తన పిల్లల చదువుల నిమిత్తం ఈనెల 26న రాజమహేంద్రవరం కుటుంబసభ్యులతో సహా వెళ్లి రాత్రికి వచ్చారు. ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు, నగదును దొంగలు అపహరించుకుపోయారు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రూరల్ ఎస్ఐ సీహెచ్‌కే దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్‌ను ఢీకొట్టిన లారీ.. ఆరుగురికి గాయాలు


లారీ ఢీ కొట్టడంతో బోల్తా కొట్టిన వాహనం

దెందులూరు, మే 27(ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టిన ప్రమాదంలో వ్యాన్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. దెందులూరు వద్ద 16వ నెంబరు జాతీయ రహదారి హెచ్‌పీ పెట్రోలు బంకు సమీపంలో ఏలూరు వైపు నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న వ్యాన్‌ను వెనుక నుంచి గుర్తుతెలియని లారీ బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. ఆ వ్యాన్‌లో ఒకే కుటుంబానికి చెందిన పదిమంది ప్రయాణిస్తుండగా అందులో ఆరుగురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. హైవే పోలీసులు 108 అంబులెన్స్‌లో దెందులూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దెందులూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

పెళ్లి వేడుక ఇంట్లో విషాదం

- గుండెపోటుతో ఏఆర్‌ఎస్‌ఐ మృతి
- ఈనెల 8న ఘనంగా కుమారుడి పెళ్లి.. అంతలోనే తండ్రి మృతి


శ్రీను కొండలరావు (ఫైల్)


ఏఆర్ఎస్ఐ మృతదేహానికి నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు

ఏలూరు క్రైం, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఆ ఇంట్లో పెళ్లి వేడుకలు జరిగి పట్టుమని నెల కూడా కాలేదు. వివాహం జరిగిందని అందరూ ఆనందంతో వారి కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారు. వివాహమైన కుమారుడు విదేశాలకు వెళ్లేందుకు రిజర్వేషన్లు చేయించుకున్నాడు. అంతలోనే ఆ ఇంట్లో తీరని విషాదం నెలకొంది. వివరాలివి.. జిల్లా ఆర్మ్డు రిజర్వుడు విభాగంలో ఏఆర్‌ఎస్‌ఐగా పనిచేస్తున్న గొల్లా శ్రీనుకొండలరావు(59) ఏలూరు సత్యనారాయణ థియేటర్ సమీపంలో నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన తన కుమార్తెకు గతంలోనే వివాహం చేశారు. కుమారుడికి ఈనెల 8న వివాహం చేశారు. విదేశాల్లో ఉంటున్న కుమారుడు వివాహం నిమిత్తం వచ్చాడు. వచ్చేనెల రెండో తేదీన తిరిగి వెళ్లేందుకు రిజర్వేషన్ చేయించుకున్నాడు. పెళ్లి వేడుకలు ఘనంగా జరిగాయని బంధువులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆనందంగా చెప్పుకున్నారు. ఏఆర్‌ఎస్ఐ కొండలరావు మంగళవారం వేకువజామున చాతీనొప్పికి గురికావడంతో ఆయనను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. అత్యవసర విభాగంలో చికిత్స చేస్తుండగా కార్డియాక్ అరెస్టుకు గురయ్యారు. గుండెపోటు వల్ల మరణించారని వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసు అధికారులు పోలీస్‌శాఖ తరఫున సహాయ చర్యలతో పాటు ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఎస్పీ కిషోర్ ఆదేశాల మేరకు పోలీస్‌శాఖ తరఫున ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, ఏఆర్‌ఆర్ఐ పవన్‌కుమార్, జిల్లా పోలీస్ సంఘ అధ్యక్షుడు ఆర్. నాగేశ్వరరావు, సంఘ నాయకులు రమేష్‌కుమార్, ఏఆర్‌ఎస్ఐ శ్రీనివాస్, ఆర్ఎస్ఐ సత్యనారాయణ పలువురు అధికారులు వెళ్లి ఆయన మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అంత్యక్రియలు నిమిత్తం పోలీస్‌శాఖ తరఫున ఆర్థిక సాయాన్ని అందించారు.

మద్యం మత్తులో యువతి హల్‌చల్



బుధవారం మార్కెట్ వద్ద రోడ్డుపై పడుకుని హల్‌చల్ చేస్తున్న యువతి

భీమవరం క్రైం, మే 27 (ఆంధ్రజ్యోతి) : భీమవరం పట్టణంలోని బుధవారం మార్కెట్ కూడలి వద్ద మంగళవారం మధ్యాహ్నం ఒక యువతి మద్యం మత్తులో హల్‌చల్ చేసింది. ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు మధ్యాహ్నం సమయంలో ఒక యువతి, యువకుడు ద్విచక్ర వాహనంపై భీమవరం పట్టణానికి వచ్చారు. ఇద్దరూ మద్యం మత్తులో ఉండడంతో ఇద్దరి మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగింది. అనంతరం ఆ యువకుడు ఆమెను తీసుకువెళ్లనని తెగేసి చెప్పి బైక్‌పై వెళ్లిపోయాడు. అనంతరం మద్యం మత్తులో ఉన్న ఆ యువతి ఆ యువకుడిని రప్పించాలంటూ హల్‌చల్ చేసింది. రోడ్డుపై అడ్డంగా పడుకుని వాహనాలను ఆపింది. సుమారు 20 నిమిషాలపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకుని ఆ యువతిని సముదాయించారు. ఏమైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. కొంతసేపటికి ఆ యువతి ఆటోలో వెళ్లిపోయింది. వారిద్దరిది పాలకోడేరు గ్రామమని అక్కడ ఉన్నవారు చెబుతున్నారు. సిటీల్లో ఉన్న కల్చర్ పట్టణాలకు కూడా వ్యాపిస్తుందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

బాలికపై అసభ్య ప్రవర్తన.. పోక్సో కేసు నమోదు

భీమవరం క్రైం, మే 27(ఆంధ్రజ్యోతి) : పదేళ్ల బాలికపై 35 ఏళ్ల వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడిన ఘటన భీమవరం మండలంలో జరిగింది. భీమవరం టూటౌన్ సీఐ జి.కాళీచరణ్ తెలిపిన వివరాలివి.. భీమవరం మండలానికి చెందిన ఒక మహిళకు ఇద్దరు కుమార్తెలు. అయితే వారింటి పక్కన అద్దెకు ఉండే సెంట్రింగ్ పని చేసే ఎ.రంగనాథ్ అనే వ్యక్తి ఆ బాలికపై కన్నేశాడు. ఈనెల 26న సాయంత్రం ఆరు గంటల సమయంలో పదేళ్ల బాలిక రోడ్డుపై ఆడుకుంటుండగా అతడు స్వీట్లు ఇస్తానని బాలికను ఇంటిలోకి రమ్మన్నాడు. ఆ సమయంలో అతడి భార్య లేకపోవడంతో ఆ బాలిక తెలియక ఇంట్లోకి వెళ్లింది. బాలికపట్ల అతడు అసభ్యంగా ప్రవర్తించడంతో బయటకు పరుగెత్తింది. వెంటనే తల్లికి విషయం చెప్పడంతో ఆ తల్లి పోలీసులను ఆశ్రయించింది. వెంటనే కేసు నమోదు చేసి అతడిని అదుపులోకి తీసుకున్నట్టుగా పోలీసులు తెలిపారు.


ఆంధ్ర, తెలంగాణ సరిహద్దుపై రెవెన్యూ మ్యాప్ పరిశీలిస్తున్న అధికారులు

తెలంగాణకు ఇసుక అక్రమ రవాణాపై అడ్డుకట్ట

- నిఘా ఏర్పాటు చేసిన రెవెన్యూ, పోలీస్ అధికారులు

కుక్కునూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, తెలంగాణ సరిహద్దులో ఉన్న కిన్నెరసాని నది నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్న నేపథ్యంలో అడ్డుకట్ట వేసేందుకు ఆంధ్రా అధికారులు నిఘా ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా తెలంగాణలోని భూర్గంపాడులో భవన నిర్మాణానికి కిన్నెరసాని నది నుంచి అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్న విషయం విదితమే. ఈ క్రమంలో మంగళవారం కుక్కునూరు తహసీల్దార్ రమేశ్‌బాబు కుక్కునూరు సీఐ రమేశ్ నది వద్ద క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇసుక తవ్వకం జరుగుతున్న ప్రాంతం ఆంధ్రా సరిహద్దులోనే ఉన్నట్టు రెవెన్యూ మ్యాప్ ద్వారా గుర్తించారు. అనంతరం ఇసుక అక్రమ రవాణాపై తెలంగాణలోని పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అక్రమ రవాణా అడ్డుకునేందుకు రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశామని తహసీల్దార్ తెలిపారు. ఇసుక అక్రమరవాణా చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

పాతనేరస్తులపై బైండోవర్

నూజివీడు టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని తొమ్మిది మంది నేరస్తులను నూజివీడు తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. సారా రహిత మండలంగా నూజివీడు మండలాన్ని మార్చాలని అలాకాకుండా తమ విధానాలు మార్చుకోకుండా పాతనేరాలని కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదానం

పెదపాడు, మే 27(ఆంధ్రజ్యోతి) : అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద దాతల సహకారంతో సుమారు 200 మందికి అన్నదానం నిర్వహించినట్టు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు తెలిపారు. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన రామాంజనేయ జనరల్ స్టోర్స్ వారి ఆర్థికసహకారంతో మంగళవారం అన్నదానం నిర్వహించినట్టు ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు చెప్పారు. మంగళవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి, మే 27(ఆంధ్రజ్యోతి) : కూచింపూడిలోని విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఈఈ కేఎం.అంబేడ్కర్ తెలిపారు. కూచింపూడితో పాటు న్యాయంపల్లి, కొప్పులవారిగూడెం పరిధిలోని మైల్ ఎనర్జీ ఫీడర్, వ్యవసాయ, గృహ అవసరాల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరించండి

ఏలూరు రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసి హైదరాబాద్‌లో సెటిల్ అయిన పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి టీడీపీ ప్రభుత్వం సమర్థవంతమైన విధానాలను అమలు చేయాలని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బుచ్చిరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఏలూరు వచ్చిన ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటి, రెండు తేదీల్లోనే పెన్షన్ విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు లీవ్ ఎన్ కాష్మెంట్ బిల్లులను చెల్లించాలని, పెన్షనరీ బెనిఫిట్స్ విడుదల చేయాలని కోరారు. టీడీపీ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టినట్టుగా పెన్షనర్ల సమస్య పరిష్కారానికి ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలన్నారు.

హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడండి



జంగారెడ్డిగూడెం, మే 27(ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు తెరిచే నాటికి సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో అర్హులైన విద్యార్థులను చేర్పించే సంఖ్య పెంచాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి జేడీ ఎం.ముక్కంటి సూచించారు. మంగళవారం గాయత్రి ఒకేషనల్ కళాశాలలో కొయ్యలగూడెం సహాయ సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొయ్యలగూడెం సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి పరిధిలో 11 హాస్టళ్లు ఉన్నాయన్నారు. వీటిలో ఎనిమిది హాస్టళ్లకు మరమ్మతుల నిమిత్తం ప్రభుత్వం రూ.70.85 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఇప్పటికి ఆరు హాస్టళ్లకు మరమ్మతులు పూర్తయ్యాయని, మిగతా రెండు 90 శాతం పూర్తయినట్టు తెలిపారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్ల వార్డెన్లు, వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జడ్పీ నిధులు రూ.25 లక్షలతో గ్రామాభివృద్ధి



రోడ్డు శంకుస్థాపనకు హాజరైన నాయకులు

జంగారెడ్డిగూడెం, మే 27(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జడ్పీ నిధులు రూ.25 లక్షలతో మండలంలోని అక్కంపేటలో పలు అభివృద్ధి కా ర్యక్రమాలకు జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ శంకుస్థాపన చేశారు. తమ గ్రామంపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎస్సీ కాలనీలో మంచినీటి బోరు, సీసీ రోడ్ల నిర్మాణానికి స హకరించిన ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌కు సర్పంచ్ పారేపల్లి నాగేంద్ర బాబు, కూటమి నాయకులు తారిపిరెడ్డి రామకృష్ణ, ఆకుల సుబ్రహ్మణ్యం, గొల్లమందల శ్రీనివాసరావు, మోతే సిద్ధారావు, తొమ్మండ్రు వెంకటేశ్వరరావు, నులకాని సూరిబాబు, మాజీ సర్పంచ్ కాజా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

బకాయి జీతాలు ఇప్పించాలంటూ ధర్నా

ఏలూరు రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి) : శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు మెయింటెనన్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ నాయకులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. బకాయి పడ్డ 9 నెలల జీతాలను చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు ప్రారంభం నుంచి కార్మికులుగా పనిచేస్తూ ఏజెన్సీ మెట్ట ప్రాంత నియోజకవర్గాలైన గోపాలపురం, పోలవరం, కొవ్వూరు, చింతలపూడి నియోజకవర్గ ప్రజలకు గోదావరి జిల్లాలను శుద్ధి చేసి మంచినీరుగా అందిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. యూనియన్ అధ్యక్షులు జి.శివ సత్యనారాయణ, కార్యదర్శి ఎ.సత్యనారాయణ మాట్లాడుతూ వర్కర్స్‌కు 9 నెలలుగా జీతాలు లేకపోవడంతో పస్తులు ఉండాల్సి వస్తోందన్నారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



పుస్తకాలు చదివిస్తున్న వెంకట రమణ

లింగపాలెం, మే 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతిరోజూ గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదవడం వల్ల విజ్ఞానం పెంపొందించుకోవచ్చని గ్రంథాలయాధికారి జి.హెచ్.వెంకట రమణ అన్నారు. ధర్మాజీగూడెం గ్రంథాలయంలో గ్రామర్, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, సైన్స్‌లో పలు అంశాలను నేర్పించారు. విద్యార్థులకు సైన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని, సైన్స్‌లో సూత్రాలు తెలుసుకునేందుకు విజ్ఞాన శిబిరాలు దోహదం చేస్తాయన్నారు.

వీరేశలింగం జీవిత చరిత్రపై అవగాహన..



చిన్నారులకు కథలు చెబుతున్న బెంజిమెన్

పెదపాడు : ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన జీవిత చరిత్ర, స్త్రీలు ఎదుర్కొన్న కష్టాలు, సమస్యలపై ఆయన చేసిన పోరాటం, రచనలను విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ రామాల బెంజిమెన్ వివరించారు. అనంతరం పాణ్యం రామశేష శాస్త్రి రాసిన తల్లి ప్రాణం అనే నీతికథను విద్యార్థులకు వివరించినట్టు గ్రంథాలయాధికారి దుగ్గిపోగు జాన్‌బాబు తెలిపారు.

కష్టపడితేనే మంచి ఫలితాలు : నారాయణరావు

ఏలూరు టూటౌన్ : విద్యార్థులు కష్టపడితే ఏ రంగంలోనైనా మంచిఫలితాలు సాధించవచ్చని డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణరావు అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ ఐ.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు శాస్త్రవేత్తల గురించి వివరించారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం కృషిని వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ బీటీ సందీప్ కుమార్, ఎండీ అస్లాంపాష, ఎం.కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం

జంగారెడ్డిగూడెం, మే 27(ఆంధ్రజ్యోతి) : ఊర చెరువు ప్రాంతంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణ టీడీపీ అధ్యక్షుడు రావూరి కృష్ణనాయకులు కొండ్రెడ్డి కిషోర్, చెరుకూరి శ్రీధర్, అల్లూరి రామకృష్ణ, మిడతా పెంటయ్య జనసేన నాయకులు ఉక్కుర్తి సీతారాం, వైసీపీ నాయకుడు కంచర్ల విష్ణు తదితరులు అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పిల్లల జీవితాలతో ఆటలా..?

(3వ పేజీ తరువాయి)

విద్యార్థిని ఆన్సర్‌షీటులో జవాబులను రాసిన తొలి 8పేజీలనే మూల్యాంకనం చేసి, ఆ తర్వాత ఒక పేజీని ఖాళీగా ఉంచి, ఆ వెంటనే జవాబులను రాసిన 14 పేజీలను వాల్యూయేషన్ చేయకుండానే వదిలేసినట్టు తేలింది. ఇటువంటి తప్పిదాలు వెలుగులోకి వచ్చేవి కొన్నే. ఇకనైనా మూల్యాంకనంలో జరుగుతున్న ఇటువంటి తప్పిదాలు మళ్లీ జరగకుండా సంస్థాగత సంస్కరణలకు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, ఉన్నతాధికారులు నాంది పలకాల్సి ఉంది.

క్రీడలకిచ్చే విలువ ఇదేనా!



రన్నింగ్ ట్రాక్ సరిగా లేని క్రీడామైదానం

అరకొర సౌకర్యాలతో క్రీడాకారులకు ఇబ్బందులు

సౌకర్యాలు కల్పిస్తే మరింత రాణిస్తామంటూ ధీమా

లింగపాలెం, మే 27(ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో రాణించడానికి తగిన సదుపాయాలు కల్పించాలంటూ పలువురు క్రీడాకారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. లింగపాలెం మండలంలో ఉన్న పాఠశాలలో అనేక క్రీడల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారు. రంగాపురం, కె.గోకవరం, ధర్మాజీగూడెం, కలరాయనగూడెం హైస్కూళ్లకు చెందిన విద్యార్థులు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. వారిలో కొందరు అండర్ 14, 17, 19 విభాగాల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలకు ఎంపికయ్యారు. వారు అనేక పోటీల్లో పాల్గొని ఎన్నో పతకాలు సాధించారు. హ్యాండ్‌బాల్, వాలీబాల్, రన్నింగ్, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని తమలో ఉన్న ప్రతిభను కనబర్చి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి రాష్ట్ర స్థాయిలో అనేక పతకాలు సాధించారు. వీరి ప్రతిభకు తగిన విధంగా వసతులు కల్పిస్తే విద్యార్థులు మరింతగా రాణిస్తారని వ్యాయామ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. సరైన క్రీడామైదానాలు, క్రీడా సౌకర్యాలు లేకపోయినా అరకొర వసతుల్లోనే రాణిస్తూ ప్రతిభను కనబరుస్తున్నారు. మండలంలోని కొన్ని పాఠశాలల్లో కొన్నేళ్ల క్రితం వాలీబాల్, బాస్కెట్ బాల్, 100, 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్స్, బ్యాడ్మింటన్ కోర్టులను అరకొరగా అభివృద్ధి చేసినా ప్రస్తుతం అవి అధ్వానంగా మారాయి. పలు పాఠశాలల్లో ప్రతిభవంతులైన వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రతిభ కలిగిన క్రీడాకారులున్నా సాధన చేసేందుకు సరైన క్రీడామైదానాలు లేకపోవడంతో పలువురు విద్యార్థులు క్రీడల్లో రాణించలేకపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించి క్రీడాకారులకు అనువైన క్రీడామైదానాలు అభివృద్ధి చెయ్యాలని పలువురు కోరుతున్నారు.

అరకొర వసతుల్లోనే ప్రాక్టీస్ చేస్తున్నాం



మౌనిక, క్రీడాకారిణి, కె.గోకవరం

సరైన క్రీడా సౌకర్యాలు లేకపోయినా వ్యాయామ ఉపాధ్యాయుల ప్రోద్బలంతో అరకొర సౌకర్యాలతోనే సాధన చేస్తున్నాం. ప్రభుత్వం క్రీడలకు అవసరమయ్యే మైదానాలు అభివృద్ధి చేసి క్రీడా పరికరాలు కల్పిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలున్నాయి.

మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే క్రీడల్లో రాణిస్తాం



ఎం.పవన్ కుమార్, టెన్నికాయిట్ క్రీడాకారుడు, కె.గోకవరం

క్రీడాకారులకు కనీస సౌకర్యాలు, క్రీడా పరికరాలు అందుబాటులో లేవు. వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో ఉన్న కొద్దిపాటి సౌకర్యాలతోనే సాధన చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో క్రీడా మైదానాలు కూడా సరిగా లేవు. మరిన్ని వసతులు కల్పిస్తే ఉన్నతంగా రాణిస్తాం. ప్రభుత్వం తమపై కొంచెం శ్రద్ధ చూపాలని కోరుకుంటున్నాం..









మహానాడులో మంత్రి లోకేశ్, సీఎం చంద్రబాబులతో ఎంపీ మహేశ్, మహానాడు కిట్లతో జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం నాయకులు

మహానాడుకు తరలిన పసుపు దళం

ఏలూరు జిల్లా నుంచి భారీగా తరలింపు

చంద్రబాబు, లోకేశ్‌లతో మాటామంతీ

ఏలూరు టూటౌన్/కొయ్యలగూడెం/కామవరపుకోట/నిడమర్రు/ జంగారెడ్డిగూడెం/ పెదవేగి, మే 27 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న మహానాడులో జిల్లా నాయకులు పాల్గొని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లతో ముచ్చటించారు. ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, ఎమ్మెల్యే చంటి, నగర పాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు. ముందుగా కడప విమానాశ్రయంలో సీఎం చంద్రబాబుకు ఎంపీ స్వాగతం పలికారు. అనంతరం లోకేశ్‌తో ముచ్చటించగా పార్టీ అభివృద్ధికి ఎంపీ చేస్తున్న కృషిని కొనియాడారు. కొయ్యలగూడెం మండలం నుంచి భారీగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ ఆధ్వర్యంలో కామవరపుకోట మండలంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మహానాడుకు తరలివెళ్లారు. బుధవారం రావికంపాడు గ్రామం నుంచి ప్రత్యేక బస్సు ద్వారా మహానాడుకు వెళ్తున్నట్టు పార్టీ నాయకులు తెలియజేశారు. నిడమర్రు మండలంలోని వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. టీడీపీ మండలాధ్యక్షులు ముత్యాల స్వామి ఆధ్వర్యంలో సుమారు 50 మంది కార్యకర్తలు వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. వీరిలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పొట్నూరి సింహాచలం, ఆదిరెడ్డి చంద్రరావు, సత్తినీడి నాని, అంబళ్ల విజయభాస్కర్, పసుపు లేటి సుబ్బయ్య, బొబ్బిలి వెంకట స్వామి, పతివాడ సీతా రామ్, అంబళ్ల నాగబాబు తరలివెళ్లారు. జంగారెడ్డిగూడెం మండలం నుంచి మహానాడుకు టీడీపీ నాయకులు మండవ లక్ష్మణరావు, మద్దిపాటి నాగేశ్వరరావు, ఎస్ఎస్. ఇస్మాయిల్, పరిమి సత్తిపండు, పెనుమర్తి రామకు మార్, గుమ్మడి ప్రసాద్, బొబ్బర రాజ్‌పాల్ కుమార్ తరలివెళ్లారు. పెదవేగి మండలం నుంచి భారీగా తరలివెళ్లారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సోమవారం అక్కడే వంట పనుల్లో నిమగ్నం కాగా, నాయకులు తరలివెళ్లి అక్కడే ఉన్న ఎమ్మెల్యేను కలిశారు.



లింగపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పెదవేగిలోని ర్యాలీలో పాల్గొన్న అధికారులు

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

దెందులూరు, మే 27(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా యోగా సాధన చేసి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని పెదపాడు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఏసీడీపీవో ఎం.సునీల్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం దెందులూరు మండలం కొవ్వలిలో అంగన్వాడీ సెక్టార్ సూపర్ వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. దెందులూరు సెక్టార్‌లో సూపర్ వైజర్ చిట్టమ్మ ఆధ్వర్యంలోను సోమవరప్పాడు సెక్టార్ పరిధిలో సూపర్ వైజర్ పద్మభూషణం ఆధ్వర్యంలో 11వ యోగా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు.

● జీలుగుమిల్లి : యోగా సాధన ద్వారా శారీరక మానసిక ధృఢత్వంతో పాటు జీవన విధానం మెరుగుపడుతుందని ఎంపీడీవో నిఖిల్ మధుచరణ్ అన్నారు.పి.అంకంపాలెంలో ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు యోగా సాధన దాని వల్ల కలిగే ప్రయోజనాల్ని వివరించారు. యోగాను ప్రతీ ఒక్కరూ దినచర్యగా మార్చుకోవాలన్నారు. పంచాయతీ సిబ్బంది, ఫిల్డ్ అసిస్టెంట్ సుజాత ఉన్నారు.

● ఏలూరు రూరల్ : యోగా ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఏలూరు ఎంపీడీవో వెన్నా శ్రీలత పంచాయతీ, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై మంగళవారం సమీక్షించారు. విశాఖలో నిర్వహించే సామూహిక యోగా సాధనకు ఏలూరు రూరల్ మండలం నుంచి ముగ్గురు మాస్టర్ ట్రైనీలను ఎంపిక చేసినట్టు తెలిపారు.

● కామవరపుకోట : కళ్ళచెరువు గ్రామంలో మంగళవారం పీడీ శారద ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే కిశోరి వికాసాన్ని పురస్కరించుకుని తడికలపూడి ఎస్ఐ పి.చిన్నారావు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీఓ పి.బ్యూలా, సూపర్‌వైజర్లు ఎస్.వీరకుమారి, వి.వి.ఎల్.మంగాదేవి పాల్గొన్నారు.

● పెదవేగి : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం యోగాపై అవగాహన కల్పించారు. సచివాలయ సిబ్బందికి యోగాసనాలపై శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ అమీర్ షరీఫ్, యోగా శిక్షకులు ఎం.శ్రీనివాసరావు, కే.శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శులు బి.హెచ్.ఎస్వీ.కృష్ణంరాజు, కె.వరప్రసాద్, సాయి కృష్ణ, శ్రీనివాసరావు, విజయ్ పాల్గొన్నారు.

● లింగపాలెం : ఎంపీడీవో కందుల వాణి, తహసీల్దార్ ప్రసాద్ ఆధ్వర్యంలో యోగాంధ్ర నిర్వహించారు. అనంతరం ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు యోగాపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వివిధ శాఖలకు చెందిన పలువురు ఉద్యోగులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పిల్లల పట్ల జాగ్రత్త వహించండి



గ్రామ సభలో మాట్లాడుతున్న సీఐ కోటేశ్వరరావు

ఏలూరు క్రైం, మే 27(ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలను చెరువులు, కాల్వల వద్దకు ఈతకు వెళ్లకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏలూరు త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు అన్నారు. ఏలూరు ఎస్పీ కేపీఎస్ కిశక్షర్ ఆదేశాల మేరకు ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ రాంబాబు కలిసి పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్లూరులో పల్లెనిద్రలో భాగంగా గ్రామస్థులతో కలిసి గ్రామ సభ నిర్వహించారు.ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు ప్రశాంతంగా భద్రతతో జీవించడానికి అవసరమైన పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. పోలీస్ శాఖ అత్యవసర సమయాల్లో సహాయాన్ని అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్లను ఏర్పాటు చేసిందన్నారు.ఆపదలో ఉన్న వారు ఎవరైనా 112కు సమాచారమిస్తే పది, పదిహేను నిమిషాల్లో బాధితుల వద్దకు పోలీసులు చేరుకుంటారన్నారు. మత్తుపదార్థాల నివారణ కోసం 1972కు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని లింకులు, ఓటీపీల కోసం వచ్చే కాల్స్‌ను నమ్మవద్దన్నారు. అనతరం మోటార్‌వెహికల్ చట్టం గురించి అవగాహన కల్పించారు. రానున్న వర్షాకాలంలో రైతులు మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పనులు చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చోరీల నివారణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 112కి ఏలూరు త్రిటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఉత్సాహంగా జాబ్ మేళా



కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

భీమడోలు, మే 27(ఆంధ్రజ్యోతి): యువతలో ప్రతిభను, నైపుణ్యాలను వెలికితీసి వారికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఈ జాబ్ మేళాలను నిర్వహిస్తున్నట్టు ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈ డాప్ జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో భీమడోలు గీతాంజలి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ మేళాలో 30 కంపెనీలు పాల్గొనగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పరిశీలించారు. తొలుత గుండు గొలనులో సబ్ స్టేషన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. గుండుగొలనులో పంట పొలాలకు సాగునీరందించే పెద కాల్వలో పూడికతీత పనులను ఆయన ప్రారంభించారు. నియోజకవర్గ కూటమి నాయకులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పంట పరిపక్వతపై అవగాహన అవసరం

టి.నర్సాపురం, మే 27(ఆంధ్రజ్యోతి) : నవభారత్ కంపెనీ ఆయిల్‌పామ్ రైతులకు గెలలు నరికే సమయంలో పంట పరిపక్వతపై అవగాహన కల్పించాలని జంగారెడ్డిగూడెం ఆయిల్ పామ్ జోన్ రైతు సంఘం అధ్యక్షులు ఆచంట సూర్యనారాయణ కోరారు. నక్కినవారిగూడెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవభారత్ కంపెనీ రైతులు విక్రయిస్తున్న పంటకు ప్రస్తుతం 14రోజులకు అందిస్తున్న నగదును వారంరోజుల్లో చెల్లించాలని ఆయన కోరారు. తెలంగాణలో ఆయిల్ పామ్ పంట రికవరీ టన్నుకు 19.43 శాతం దిగుబడి వస్తుందని, ఆంధ్రప్రదేశ్‌లో ఆయిల్‌పామ్ పంట రికవరి టన్నుకు 19.36 శాతం దిగుబడి వస్తోందన్నారు.తెలంగాణ రాష్ట్రంతో సమానమైన ధర నవభారత్ కంపెనీ చెల్లిస్తోందన్నారు. కార్యక్రమంలో జాతీయ ఆయిల్ పామ్ జాతీయ రైతుసంఘం సభ్యులు జి.శ్రీధర్ పాల్గొన్నారు.

గృహనిర్మాణ పురోగతిపై సమీక్ష

టి.నర్సాపురం, మే 27(ఆంధ్రజ్యోతి): గృహనిర్మాణ పురోగతిపై స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో గృహనిర్మాణ సంస్థ పీడీ సత్యనారాయణ సమీక్ష నిర్వహించారు. ఇల్లు అమ్ముతానని రూ.4 లక్షలు తీసుకుని మోసం చేశాడని కలెక్టరేట్‌లో ఫిర్యాదు అందిన నేపథ్యంలో పీడీ విచారణ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో మణి కుమారి, గృహనిర్మాణ సంస్థ మేనేజర్ షరీఫ్, డీఈ రమాకాంత్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిపై దాడిని ఖండిస్తూ నిరసన

ఏలూరు రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ విద్యార్థి జేమ్స్‌పై జరిగిన పాశవిక దాడిని ఖండిస్తూ ఏలూరులో దళిత సంఘాలు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపాయి. దళిత నాయకులు మాట్లాడుతూ సభ్య సమాజం తల దించుకునేలా దాడికి పాల్పడిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌వోను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాలకు చెందిన ఆర్.మణి సింగ్, మంచెళ్ళ ఇసాక్, మెండెం సంతోష్ కుమార్, మత్తె బాబీ, నూకపెయ్యి కార్తీక్, కాపు దాసి రవికుమార్, పల్లా ఏసేబు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయంలో నెహ్రూ వర్ధంతి

ఏలూరు కార్పొరేషన్, మే 27(ఆంధ్రజ్యోతి) : భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని మంగళవారం స్థానిక కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గౌడు రంగబాబు, లంకా రామ్మోహన్, దండుబోయిన చంద్రశేఖర్, ప్రతాప సుబ్రహ్మణ్య శర్మ, శ్రీనివాస్, సూర్యనారాయణ, సేవాదళ్ సుబ్బారావు, కె.ఎస్.ఎన్.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు అందుకున్న క్రీడాకారులు

క్రీడా దుస్తులు అందజేత

ఏలూరు రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాస్కెట్ బాల్ వేసవి శిక్షణ శిబిరం స్థానిక కస్తూర్బా మున్సిపల్ గరల్స్ హైస్కూల్లో కోచ్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరుగుతోంది. ఈ నెల ఒకటిన ప్రారంభమైన శిక్షణ 31వ తేదీ వరకు జరగనుంది. 40 మంది క్రీడాకారులు శిక్షణనందిస్తున్నారు. సోమవారం బాస్కెట్ బాల్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు ఘనంగా పెదవేగి మండలం రామసింగవరం జడ్పీ హైస్కూల్ పీఈగా పనిచేస్తున్న జమ్ము రామకృష్ణ క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుని జి.సునీత, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ గువ్వా శ్రీనివాసరావు, ట్రెజరర్ కె.మురళీ కృష్ణ, సీనియర్ క్రీడాకారులు టి.గోపాల్, ఎం.రమేష్, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీకి 65మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి): టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరి గిన ఫస్ట్ లాంగ్వేజి పేపర్-2, ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజి పేపర్-1(సంస్కృతం) పరీక్షలకు జిల్లాలో 170మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 105 మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. సార్వత్రిక విద్యా పీఠం దూరవిద్య ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ కెమిస్ట్రీ పరీక్షకు 27మంది, జువాలజీ 32మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు.

హామీలతో మభ్యపెట్టొద్దు

బుట్టాయగూడెం, మే 27(ఆంధ్రజ్యోతి) : హామీలతో ఆదివాసీలను మభ్య పెట్టొద్దని ఆదివాసీ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జలగం రాంబాబు తెలిపారు. మంగళవారం దీక్షలను ఆయన ప్రారంభించి దీక్షల్లో పాల్గొన్నారు. టీఏసీని వెంటనే సమావేశపరచి ఏజెన్సీ ప్రాంత ఉద్యోగ నియామక చట్టాన్ని చేయాలన్నారు. డీఎస్సీలో షెడ్యూల్ ప్రాంత ఉపాధ్యాయ పోస్టులను మినహాయిస్తూ ఉత్తర్వులిచ్చి ఆదివాసీలకు మేలు చేయాలన్నారు. ఈ దీక్షలో తెల్లం లక్ష్మి, కలుం వెంకటేశ్వరి, ఎం.శాంతకుమారి, టి.భవాని, బి.నాగరత్నం, పి.నాగమణి, ఎస్.సత్యనారాయణమ్మ, వై.రామలక్ష్మి పాల్గొన్నారు.

నేడు కార్మికుల సమావేశం

ఏలూరు కార్పొరేషన్, మే 27(ఆంధ్రజ్యోతి) : స్థానిక స్ఫూర్తి భవన్‌లో బుధవారం ఏలూరు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు సంఘ నాయకులు బండి వెంకటేశ్వరరావు, వసంతరావులు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి.హెచ్.కోటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ తదితర ప్రముఖులు ఈ సమావేశానికి విచ్చేస్తారని వారు తెలిపారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోండి

కొయ్యలగూడెం, మే27(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని స్పందన సేవా సంస్థ అధినేత బలుసు నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు మంగళవారం కొయ్యలగూడెంలో ఇళ్లు అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన పులి లోవరెడ్డి కుటుంబానికి సహాయం అందించారు. ఆ కుటుంబానికి కావాల్సిన సరుకులను అందించారు. ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే జంగీర్ బాష, తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసం అవగాన ర్యాలీ

కొయ్యలగూడెం, మే 27(ఆంధ్రజ్యోతి) : బాలికలకు అవగాహన కల్పించడం కోసం కిశోరి వికాసం కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎంపీడీవో కిరణ్, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ అంబటి సరస్వతి అన్నారు. ఈ మేరకు మంగళవారం కొయ్యలగూడెం ఎంపీడీవో కార్యాలయం వద్ద కిశోరి వికాసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు కొయ్యలగూడెం ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

ముగిసిన హనుమజ్జయంతి

ఏలూరుకార్పొరేషన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : పాతబస్టాండ్ సెంటర్‌లోని మర్రి అభయాంజనేయస్వామి ఆలయం వద్ద హనుమజ్జయంతి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా మంగళవారం భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భక్తులు సామూహికంగా స్వామివారి సన్నిధిలో హనుమాన్‌చాలీసా పారాయణ నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు వెంకటరత్నం శర్మ స్వామివారికి పంచామృతాభిషేకం జరిపి అనంతరం విశేష అలంకరణ నిర్వహించారు.

ఘనంగా జెట్టి పుట్టిన రోజు వేడుక

జంగారెడ్డిగూడెం, మే 27(ఆంధ్రజ్యోతి) : వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం నియోజకవర్గ పార్లమెంట్ పరిశీలకుడు జెట్టి గురునాథ రావు పుట్టిన రోజు వేడుకలను వైసీపీ నాయకుడు ముప్పిడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి జెట్టి క్యాంపు కార్యాలయంలో కట్ చేశారు. అనంతరం ఆశ్రమ పిల్లలకు నూతన వస్త్రాలు, భోజన ఏర్పాట్లు చేశారు. అలాగే శ్రీ సీతా రామ లక్ష్మీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు 5మంచాలు పంపిణీ చేసి భోజనాలు ఏర్పాటు చేశారు.

విషాదం

(3వ పేజీ తరువాయి)

పరిస్థితిని సమీక్షించారు. గాలింపు చర్యలు ముమ్మరం చేసి వీలైనంత త్వరగా బాలుర ఆచూకీ కనుగొనేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డీఎస్పీలు ఎస్.మురళీమోహన్, శ్రీవేద, సీఐ భీమరాజు,తహసీల్దార్ పి.శ్రీపల్లవి, ఎస్ఐ బి.శివకృష్ణ తదితరులు అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

గాలించండి : కేంద్ర మంత్రి వర్మ

గల్లంతైన ముగ్గురు బాలుర ఆచూకీ కోసం గజ ఈతగాళ్లను రంగంలోకి దించి గాలింపు చర్యలు వేగవంతంగా చేపట్టాలని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ,ఆచంట, గన్నవరం ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ,గిడ్డి సత్యనారాయణ ఆదేశించారు. జరిగిన ఘటనపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

మినుముల కొనుగోలు కేంద్రం మూసివేత

ముదినేపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం దేవపూడిలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినుముల కొనుగోలు కేంద్రాన్ని మూసి వేశారు. ప్రభుత్వం మినుములకు మద్దతు ధరను కల్పించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ కొనుగోలు కేంద్రం నెల రోజులకు పైగా కొనసాగినప్పటికీ ఒక్క రైతు కూడా మినుములను అమ్మేందుకు రాకపోవడం, ఇదే విషయాన్ని ఈనెల 26న ఆంధ్రజ్యోతిలో బోణీ కాలేదు అన్న శీర్షికన వార్త ప్రచురితమైంది. దీంతో నిరుపయోగంగా ఉన్న దేవపూడి పీఏసీఎస్‌లోని కొనుగోలు కేంద్రాన్ని మూసేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముదినేపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని వడాలి, దాకరం 11 కేవీ ఫీడర్ల ఏరియాల్లో విద్యుత్ మరమ్మతులు కారణంగా బుధవారం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బి.పూర్ణచంద్రరావు తెలిపారు. మండలంలోని వడాలి, కొరగుంటపాలెం, కోమర్రు, గోకినంపాడు, దాకరం, అప్పారావుపేట, రాజానగరం గ్రామాల పరిధిలోని గృహ, వాణిజ్య, ఆక్వా వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

విషాదం

(3వ పేజీ తరువాయి)

పరిస్థితిని సమీక్షించారు. గాలింపు చర్యలు ముమ్మరం చేసి వీలైనంత త్వరగా బాలుర ఆచూకీ కనుగొనేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డీఎస్పీలు ఎస్.మురళీమోహన్, శ్రీదేవి, సీఐ భీమరాజు, తహసీల్దార్ పి.శ్రీవల్లి, ఎస్ఐ బి.శివకృష్ణ తదితరులు అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

గాలించండి : కేంద్ర మంత్రి వర్మ

గల్లంతైన ముగ్గురు బాలుర ఆచూకీ కోసం గజ ఈతగాళ్లను రంగంలోకి దించి గాలింపు చర్యలు వేగవంతంగా చేపట్టాలని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఉండి, గన్నవరం ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, గిడ్డి సత్యనారాయణ ఆదేశించారు. జరిగిన ఘటనపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

పిల్లల జీవితాలతో ఆటలా..?

(3వ పేజీ తరువాయి)

విద్యార్థిని ఆన్సర్‌షీటులో జవాబులను రాసిన తొలి 8 పేజీలనే మూల్యాంకనం చేసి, ఆ తర్వాత ఒక పేజీని ఖాళీగా ఉంచి, ఆ వెనుక జవాబులను రాసిన 14 పేజీలను వాల్యుయేషన్ చేయకుండానే వదిలేసినట్లు తేలింది. ఇటువంటి తప్పిదాలు వెలుగులోకి వచ్చేవి కొన్నే. ఇకపైనా మూల్యాంకనంలో జరుగుతున్న ఇటువంటి తప్పిదాలు మళ్లీ జరగకుండా సంస్థాగత సంస్కరణలకు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, ఉన్నతాధికారులు నాంది పలకాల్సి ఉంది.

వే బ్రిడ్జిలో అవకతవకలు

అధికారులకు ఫిర్యాదు


చెక్కపల్లిలో శ్రీ శ్రీనివాస వేబ్రిడ్జి

ముసునూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కపల్లి గ్రామంలో శ్రీ శ్రీనివాస ఎలక్ట్రానిక్ కాటా(వేబ్రిడ్జి)లో అవకతవకలు జరుగుతున్న విషయాన్ని మంగళవారం రైతులు గుర్తించారు. దీనిపై తూనికలు, కొలతల అధికారులకు ఫిర్యాదు చేశారు. సూర్యసాయి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో సేకరించిన ధాన్యం లోడ్‌ను కాటా పెట్టగా 1890 కేజీలు తేడాగావడంతో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ చిలుకూరి వెంకటేశ్వరరావు, రైతులు తక్షణమే కాటా నిలిపి వేసి, తూనికలు, కొలతలు జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ సాయిరామ్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు వేబ్రిడ్జిను తనిఖీ చేసి, కాటాలో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో వేబ్రిడ్జిని సీజ్ చేసినట్లు సాయిరామ్ తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గతంలో ఈ వేబ్రిడ్జిలో సుమారు నాలుగు సార్లు ఇలాగే జరిగింది ని, కాటా మెయింటెనెన్స్ సరిగ్గా చేయడం లేదని ఆరోపిస్తున్నారు. దీనికి తోడు సంబంధిత అధికారుల పర్యవేక్షణ సైతం కొరవడిం దని, దీంతో కాటాలో జరుగుతున్న అవకతవకల వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని మేనేజింగ్ డైరెక్టర్ చిలుకూరి వెంకటేశ్వరరావు, రైతులు పేర్కొన్నారు. వేబ్రిడ్జి నిబంధనల ప్రకారం పక్కాగా ఉన్న పుడే కాటా ప్రక్రియకు అనుమతి ఇస్తామని అసిస్టెంట్ కంట్రోలర్ సాయిరామ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దఫేదార్ మృతి

నూజివీడు టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం కొత్తూరు వద్ద రహదారి ప్రమాదంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో దఫేదార్‌గా పనిచేస్తున్న సుబ్బారావు (55) తీవ్రంగా గాయపడి మృతి చెందారు. ద్విచక్ర వాహనంపై నూజివీడు వస్తున్న సుబ్బారావును లారీ ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలు పాలైన సుబ్బారావు సంఘటన స్థలంలోనే మృతి చెందారు. మృతునికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. నూజివీడు సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను తెలుసుకున్నారు.

విద్యుదాఘాతంతో కొబ్బరి కార్మికుడు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు

కలిదిండి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొండూరు గ్రామానికి చెందిన కట్టా రంగారావు (64) కొబ్బరి కాయలు కోయటానికి మంగళవారం తాడినాడలో ఓ ప్రైవేటు చెరువు వద్దకు కూలికి వెళ్లారు. కొబ్బరి చెట్టు ఎక్కి కొబ్బరికాయలను కోస్తుండగా, చెట్టు పక్కన ఉన్న విద్యుత్ వైర్లు చేతికి తగలటంతో విద్యుదాఘాతానికి గురై చెరువులో పడి మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ వేముల వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని దంపతులకు గాయాలు

కైకలూరు, మే 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలకు గాయాలయ్యాయి. కైకలూరు రూరల్ పోలీసుల కథనం ప్రకారం కైకలూరు మండలంలోని శృంగవరప్పాడు గ్రామంలోని లక్ష్మీపురానికి చెందిన కటూరి మణికంఠ అతని భార్య అనూషతో కలిసి ద్విచక్ర వాహనంపై ఈ నెల 18వ తేదీన కైకలూరు వచ్చారు. పనులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా వదిరిపల్లిగూడెం గ్రామంలో ఎదురుగా మరో వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భార్యభర్తలకు తీవ్ర గాయాలు కావడంతో భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై డి.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టౌన్ పోలీసు స్టేషన్‌లో షార్ట్ సర్క్యూట్



కైకలూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): కైకలూరు గాలి గాలులు అదు వారం రాత్రి కైకలూరు టౌన్ పోలీసు స్టేషన్ సమీపంలో ఉన్న చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగిలాయి. ఈ సమయంలో షార్ట్ సర్క్యూట్ అయి పోలీసు స్టేషన్‌లోని మీటర్ వద్ద ఒక్కసారిగా మంటలు చెల రేగాయి. దీంతో పోలీసులు హుటాహుటిన మంటలను అదుపు చేశారు. అప్పటికే విద్యుత్‌మీటరు పూర్తిగా దగ్ధమైంది. ఒకే భవనంలో కైకలూరుటౌన్, రూరల్ పోలీసుస్టేషన్‌తో పాటు రూరల్ సర్కిల్ కార్యాలయం ఉండడమే గాక వెనుక వైపున పెట్రోలు బంకు ఉండడంతో పోలీసులు వెంటనే మంటలు అదుపు చేయ డంతో పెనుప్రమాదం తప్పింది. విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు విద్యుత్ వైర్లను పునరుద్ధరించారు.

రీసర్వే సమస్యలు పరిష్కరిస్తాం

కొత్తగూడెం గ్రామసభలో జేసీ ధాత్రిరెడ్డి

చాట్రాయి, మే 27(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో దొర్లిన తప్పులను క్షేత్రస్థాయి పరిశీలన చేయించి సరిదిద్దుతామని రైతులకు ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి హామీ ఇచ్చారు. చాట్రాయి మండలం కొత్తగూడెం గ్రామ సచివాలయంలో మంగళవారం రీసర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు ఫీల్డ్‌కి రాకుండా సచివాలయంలో కూర్చుని రికార్డులు తయారు చేసి ఆన్‌లైన్ చేయటం వలన ఎక్కువ శాతం రైతుల భూములు రికార్డులలో తక్కువగా నమోదు అయ్యాయని, కొన్ని పట్టా భూములు అసైన్డ్ భూములుగా నమోదు చేయటం వలన వెబ్ అడంగల్ రావటం లేదని, కొన్ని భూములు రికార్డుల నుంచి గల్లంతు అయ్యాయని, ఫలితంగా అప్పులు ఇచ్చిన బ్యాంకులు మీరు భూములు అమ్ముకున్నారు. లోన్లు కట్టండి అంటూ ఇళ్ల మీదకు వచ్చి ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం భూములు మళ్లీ రీసర్వే చేసి తమకు న్యాయం చెయ్యాలని రైతులు జేసీని వేడుకున్నారు. దీనిపై జేసీ మాట్లాడుతూ రీసర్వే జరిగాక మళ్లీ సర్వే రాష్ట్రంలో ఎక్కడ జరగలేదని, అయినా ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుని సమస్య పరిష్కరిసామని అన్నారు. సర్వేయర్, వీఆర్వో డేటా ఎంట్రీ మీదకు వెళ్లి కొలతలు తీసి వాస్తవంగా ఉన్న విస్తీర్ణాన్ని నమోదు చెయ్యాలని ఆదేశించారు. ఎక్కువ విస్తీర్ణం నమోదైన రైతులు ఒప్పుకుంటే సమస్య త్వరగా పరిష్కారం అవుతుందని, గ్రామ పెద్దలు కూర్చుని మాట్లాడి స్థానికంగానే పరిష్కారం చేసుకోవాలన్నారు. లేకపోతే సబ్ కలెక్టర్ వచ్చి వాస్తవ పరిస్థితి ప్రకారం రైతులకు న్యాయం చేస్తారని అన్నారు. పట్టాదారు చనిపోతే ఆతని వారసులకు సమానంగా మ్యూటేషన్ చేయటం జరుగుతుందని అన్నారు. మళ్లీ 2 వారాల తరువాత ఇక్కడికే వచ్చి అధికారుల పనితీరును పరిశీలిస్తానని జేసీ అన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, తహసీల్దార్ ఈశ్వరరావు, సీఐ రామకృష్ణ, సర్పంచ్ చల్లగుళ్ళ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు రాజారత్నం, మలగలపల్లి సుబ్రహ్మణ్యం రైతులు పాల్గొన్నారు.


కొత్తగూడెంలో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి


మహానాడులో నారా లోకేశ్‌తో మంత్రి పార్థసారథి.. మహానాడుకు నూజివీడు నుంచి బస్సుల్లో బయలుదేరిన నాయకులు..

దారులన్నీ మహానాడు వైపే..

భారీగా కడపకు తరలిన టీడీపీ శ్రేణులు


మహానాడులో రిజిస్ట్రేషన్ చేయించుకుని బుక్ లెట్ అందుకుంటున్న వినోద్


మహానాడుకు చాగల్లు టీడీపీ నాయకులు

నూజివీడు మే 27(ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గం నుంచి కడప మహానాడుకు తెలుగు తమ్ముళ్లు తరలివెళ్లారు. నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథి మూడు బస్సులను ఏర్పాటు చేశారు. మండల నాయకులు ఎవరికి వారు కార్లు ఏర్పాటు చేసుకొని సోమవారం రాత్రి కొంత మంది, మంగళవారం ఉదయం కొంత మంది కడపకు బయలుదేరి వెళ్లారు. నియోజకవర్గ తెలుగుదేశం నాయకుడు కాపా శ్రీనివాసరావు తన స్వగ్రామం రావిచర్ల నుంచి ఒక బస్సు, 4 కార్లలో అనుచరులను తీసుకొని వెళ్లారు. కడప సమీపంలోని మైదుకూరు వద్ద ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కడప వచ్చే కార్యకర్తలు నాయకుల కోసం బస, భోజన ఏర్పాట్లు చేశారు. నాయకులకు రూట్‌మ్యాప్ ఇవ్వటంతో పలువురు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. నూజివీడు పట్టణంతో పాటు ముసునూరు చాట్రాయి ఆగిరిపల్లి మండలాల నుంచి మంగళ, బుధవారాల్లో కడప వెళ్లటానికి కార్యకర్తలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ రెండు రోజుల్లో నియోజకవర్గం నుంచి సుమారు 1000 మంది కడప వెళ్తున్నట్లు సమాచారం.

● కడపలో మంగళవారం ప్రారంభమైన మహానాడులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌తో రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి కరచాలనం చేసి, ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు.

ముదినేపల్లి: కడప జిల్లా పబ్బాపురంలో మంగళవారం ప్రారంభమైన తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంలో ముదినేపల్లి మండలానికి చెందిన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గతంలో కంటే ఈ మహానాడులో పాల్గొన్న నాయకులలో నూతనోత్సాహం కనిపించింది. నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షుడు చల్లగుళ్ళ శోభనాద్రి చౌదరి, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, పార్టీ నాయకులు బొర్రా చలమయ్య, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్నాథరావు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు దావు నాగరాజు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్‌తోపాటు పలువురు కార్యకర్తలు మహానాడులో పాల్గొన్నారు.

చాట్రాయి: చాట్రాయి మండలం నుంచి మంగళవారం ఉదయం దాదాపు అన్ని గ్రామాల టీడీపీ నాయకులు ఎవరికి వారు కార్లు ఏర్పాటు చేసుకొని బయలుదేరి వెళ్లారు. సోమవారం సాయంత్రమే కొంత మంది నాయకులు కడప వెళ్లగా, బుధవారం ఉదయం కొంత మంది కడప వెళ్లటానికి ఏర్పాట్లు చేసుకున్నారు. టీడీపీ నాయకులు మండపాటి బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, బొట్టు రామచంద్రరావు, మరిడి చిట్టిబాబు, నేకులరెడ్డి, ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, మాదాసు పుల్లారావు, కట్లా నాగ దుర్గారావు, వంగాల సుబ్బారావు, శేఖర్, రాజబాబు, నాగార్జున తదితరులు మహానాడుకు తరలివెళ్లారు.

కైకలూరు: కైకలూరు నుంచి అధిక సంఖ్యలో టీడీపీ శ్రేణులు కడపకు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, రాష్ట్ర తెలుగుయువత ప్రధాన కార్యదర్శి పూల రామచంద్రరావు, నియోజకవర్గ తెలుగు యువత నాయకుడు దావు నాగరాజు, ఎస్సీ సెల్ నాయకులు వీరాబత్తిన సుధా, పెళ్లెం తాతారావు, ఈడా వెంకటస్వామి, తదితరులు ఉన్నారు.

వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కలిదిండి, మే 27 (ఆంధ్రజ్యోతి): వర్షాల దృష్ట్యా వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలిదిండి పీహెచ్‌సీ వైద్యాధికారి హేమంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తినరాదన్నారు. భోజనానికి ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమలు కుట్టకుండా మస్కిటో కాయిల్స్, దోమ తెరలను వాడాలన్నారు. కరోనా పొంచి ఉన్న నేపథ్యంలో జనసమూహాలలోకి వెళ్లినప్పుడు మాస్క్‌లు ధరించాలన్నారు.

కృత్రిమ కాలు అందజేత

ఆగిరిపల్లి, మే 27(ఆంధ్రజ్యోతి) : ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో గల హీల్ పారడైజ్ కృత్రిమ అవయవ కేంద్రంలో మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ - గన్నవరం యూనిట్ తరుపున అందజేసిన విరాళంతో గన్నవరంకు చెందిన కొల్లూరి నాగమణి అనే మహిళకు కృత్రిమ కాలును యూనిట్ అధ్యక్షులు ముదునూరి బాల కృష్ణ మూర్తి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మానవతా కార్యదర్శి కర్రా వరప్రసాదరావు, కోశాధికారి పొట్లూరి రామకృష్ణారావు, సంయుక్త కార్యదర్శి పేటేటి వాసు ప్రసాదరావు, సభ్యులు వీవీ కృష్ణ మోహన్, సంఘ సేవకులు నెక్కలపూడి ఈశ్వరరావు, సీనియర్ టెక్నీషియన్ కె.చిన్న పాల్గొన్నారు.

భూమి శిస్తు తప్పనిసరిగా కట్టాలి

ముసునూరు మే 27 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ భూములకు సంబంధించిన శిస్తును తప్పనిసరిగా కట్టుకోవాలని తహసీల్దార్ కె.వి రమణ అన్నారు. గ్రామ సచివాలయాల్లో, ఫోన్ పే ద్వారా చెల్లించవచ్చునని తెలిపారు. భూమిపై రైతుకు హక్కు ఉండాలంటే శిస్తు కట్టాలన్నారు. రైతులు శిస్తు కట్టుకుని రశీదు పొంది, భద్రపరుచుకోవాలని తహసీల్దార్ కోరారు.

పేకాట శిబిరంపై దాడి

ముదినేపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి కొరరవాడ గ్రామ ఏరియాలో మంగళవారం సాయంత్రం పేకాట శిబిరంపై దాడి చేసి జూదరులను అరెస్ట్ చేశారు. ఎస్ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడిలో ముగ్గురు జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.4 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన

చాట్రాయి, మే 27(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చాట్రాయి అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర బాలికలకు బాల్య వివాహాల వలన అనర్థాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. పోషకాహారం ఆవశ్యకత, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గాయత్రీదేవి, ఎఎన్ఎం చంద్రకళ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(కే.జి.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244



నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

పేద కుటుంబాలకు చెక్‌లు అందజేత


చెక్ అందిస్తున్న నూజివీడు సీడ్స్ అధినేత ప్రభాకర్

ఆగిరిపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన పీ4 కార్యక్రమంలో పేద కుటుంబాలకు చేయూతను ప్రారంభించారు. అందులో భాగంగా నూజివీడు సీడ్స్ అధినేత ప్రభాకర్ ఆగిరిపల్లికి చెందిన బోనం లక్ష్మీ దుర్గకు 50 వేల రూపాయల చెక్కును నూజివీడులోని ఆయన స్వగృహంలో అందజేశారు. అదేవిధంగా ఆమె బీరల వ్యాపారం చేసుకోవడానికి పూర్తిగా సాయాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఆగిరిపల్లికి చెందిన నక్కనబోయిన వెంకటావుకు గేదెలు కొనుగోలు చేసుకునేందుకు 75 వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈకార్యక్రమంలో సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, నూజివీడు సీడ్స్ అధినేత తల్లిదండ్రులు, సీడ్స్ ప్రతినిధులు, ఎంపీడీవో బి ఆనందబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంక్ ఏటీఎంలో డిపాజిట్ సౌకర్యం

మండవల్లి, మే 27(ఆంధ్రజ్యోతి): మండవల్లి ఇండియన్ బ్యాంక్ శాఖ ఏటీఎంలో క్యాష్ డిపాజిట్ మిషన్(సీడీఎం)ను రెండు, మూడు రోజుల్లో ప్రారంభించనున్నట్టు మండవల్లి ఇండియన్ బ్యాంక్ శాఖ మేనేజర్ కె.జ్యోతిప్రసాద్ తెలిపారు. ఆదివారం బ్యాంకు ఖాతాదారుల సమావేశంలో పలువురు ఏటీఎంలో నగదు ఉండటం లేదని, ఒకటి రెండు రోజులు సెలవులు వస్తే ఖాళీ అయిపోతుందని క్యాష్ డిపాజిట్ మిషన్ ఏర్పాటు చేస్తే, ఇబ్బందులు తొలగుతాయని ఖాతాదారులు సూచన మేరకు సీడీఎం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బ్యాంకులో ఏసీలు ఏర్పాటు చేయాలని కొంతమంది అర్జీ ఇచ్చారు. దీనిపై స్పందించిన మేనేజర్ బ్యాంకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తానన్నారు.

విద్యార్థులకు యోగాపై శిక్షణ


చాట్రాయిలో యోగా శిక్షణ

ముదినేపల్లి, మే 27 (ఆంధ్ర జ్యోతి): వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ముదినేపల్లి లోని శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి ప్రాచీన యోగాసనాల ఆవశ్యకతను వివరించిన అనంతరం విద్యార్థులకు ఎంపీపీ విద్యార్థిని, యోగా శిక్షకురాలు పరసా అంకిత వివిధ రకాల ఆసనాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థి దశ నుంచి యోగాసనాలు అలవర్చుకుంటే మానసిక ఒత్తిడిని జయించవచ్చునని తెలిపారు.

చాట్రాయి: విశాఖలో జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మంగళవారం చాట్రాయిలో అధికారులు, ఉద్యోగులు, పౌరులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు అందరూ యోగాంధ్రలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

నూజివీడు టౌన్: యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తూ మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నూజివీడు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, సామాజికవేత్తలు యోగా శిక్షకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటి నుంచి కనీసం ఒక్కరు యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని వక్తలు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సాధించి పదేళ్ళు పూర్తయిన సందర్భంగా భారత ప్రధాని నరేంద్రమోదీ విశాఖపట్నం రానున్న నేపథ్యంలో రాష్ట్రంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఇది మన ఆరోగ్యకార్యక్రమంగా గుర్తించాలన్నారు. ప్రస్తుత భారత సమాజంలో పని ఒత్తిడి, జీవన శైలిలో అనేక అంశాలలో విపరీతమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్న నేపథ్యంలో యోగా ఓ గొప్ప దివ్య ఔషధంగా ఉపయోగపడుతుందన్నారు. నిత్యయోగ సాధనతో ఆరోగ్యం దినదిన అభివృద్ధి సాధిస్తుందన్నారు.


ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

ఎయిడ్స్‌పై కళాజాత బృందం అవగాహన

ముదినేపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖతో పాటు ఏపీ స్టేట్ ఎయిడ్స్ నివారణ సొసైటీ సంయుక్తంగా మంగళవారం ముదినేపల్లిలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గుడివాడకు చెందిన కళారూపాల బృందం ఎం.శేఖర్ బాబు ఆధ్వర్యంలో జానపద కళాజాత ప్రచారం నిర్వహించి ఎయిడ్స్ నిరోధక చర్యలను వివరించారు. హెచ్ఐవీ నివారణ తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించి ప్రజలు ఈ వ్యాధి పట్ల చైతన్యవంతంగా వ్యవహరించాలని కళాబృందం తన ప్రదర్శనల ద్వారా కోరింది.

చెత్త నుంచి సంపద తయారీ ప్రారంభం


చాట్రాయిలో వానపాముల ఎరువు తయారీ ప్రారంభిస్తున్న అధికారులు

చాట్రాయి, మే 27 (ఆంధ్రజ్యోతి): చాట్రాయిలోని సంపద తయారీ కేంద్రంలో మంగళవారం చెత్త నుంచి వానపాముల ఎరువు తయారీ ప్రక్రియను ప్రారంభించారు. సంపద కేంద్రంలోని తొట్లలో వానపాముల పిల్లలను వదిలారు. పోలవరం, చనుబండ, వర్కతాపురం, మర్లపాలెం గ్రామాలలోని సంపద కేంద్రాలలో కూడా వానపాముల ఎరువు తయారీ ప్రక్రియ ప్రారంభించినట్లు అధికారులు చెప్పారు. పంచాయతీ కార్యదర్శి ఎంపీఎస్ నాగరాజు మాట్లాడుతూ పిల్లలను వదిలిన తరువాత 40 రోజులలో వానపాముల ఎరువు తయారు అవుతుందని, వారంలో సంపద కేంద్రాలలో వానపాముల ఎరువు తయారీ మొదలవుతుందని చెప్పారు.

పచ్చిరొట్టతో భూమికి సారం

సబ్సిడీపై ప్రభుత్వం విత్తనాలు పంపిణీ


చెక్కపల్లిలో ఏపుగా పెరిగిన జీలుగ

ముసునూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువుల వాడకంలో భూసారం తగ్గిపోయి భూములు చౌడుబారిపోవడంతో పర్యావరణ కాలుష్యానికి కారణమవుతోంది. దీనికి తోడు రైతులకు పెట్టుబడి ఖర్చు పెరుగుతోంది. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కాలంటే పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రియ ఎరువులను వాడటం మేలు అని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. పశువుల ఎరువు, వర్మీ కంపోస్ట్ కొరతతో రైతులు పచ్చిరొట్ట విత్తనాలను ఎరువుగా వాడకంపై దృష్టి సారిస్తున్నారు. దీనికి అనుగుణంగా ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై అందించి ప్రోత్సహిస్తున్నారు. పచ్చిరొట్ట ఎరువు పంటల్లో జీలుగ, పిల్లిపెసర, జనుము, అలసంద, ఉలవ, మినుము, పెసర, అకొల్లా అనుకూలమైనవి.

పచ్చిరొట్ట ఎరువులతో ఉపయోగాలు

పచ్చిరొట్టతో నేలలో సేంద్రియ కర్బనం పెరుగుతుంది. భౌతిక లక్షణాలైన నేల నిర్మాణం, నేలలోని గాలిని మెరుగుపరుస్తుంది. నేలలో ఉండే ప్రయోజనకర సూక్ష్మజీవుల సంఖ్యను పెంచుతుంది. వేసవిలో సంభవించే భారీ గాలులు, వర్షాల వల్ల నేల కోతను నివారిస్తుంది. రసాయనిక ఎరువుల వాడకాన్ని 15 నుంచి 25 శాతం వరకు తగ్గించడంలో తోడ్పడుతుంది. పచ్చిరొట్ట ఎరువుల నుంచి లభించే పోషకాలు ఎక్కువ కాలం పంటకు నిదానంగా లభిస్తాయి. కలుపు మొక్కల నుంచి ప్రధాన పంటను పోటీని తగ్గించడంలో సహాయపడతాయి.

వేటిని ఎంచుకోవాలి

తక్కువ నీరు లభ్యమయ్యే పరిస్థితుల్లో పెంచాలి. అధిక జీవ పదార్థం ఉత్పత్తి చేసేవి అవసరం. మట్టిలో కలిసినప్పుడు వేగంగా కుళ్ళిపోయేవి ఉండాలి. ఖరీఫ్ పంటలు వేసే ముందు ఒకటి, రెండు వర్షాలు కురిసిన తర్వాత పచ్చిరొట్ట పైరు విత్తనాలను విత్తుకోవాలి. విత్తిన తర్వాత 50 నుంచి 60 రోజుల వరకు పైరుగా పెంచి, కుళ్లిపోవడానికి నేలలో కలియదున్నాలి. ఇవి పూర్తిగా కుళ్ళి పోవడానికి వారం రోజులు పడుతుంది. పచ్చిరొట్ట పంటను దున్నడం వల్ల మట్టిలో బాగా కలిసి పోవడానికి సహాయ పడుతుంది. తర్వాత రోటవేటర్‌ను ఉపయోగిస్తే జీవపదార్థం వేగంగా కుళ్ళిపోతుంది.

రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు



నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలను పంటలకు విరివిగా అందించే పచ్చిరొట్ట పంటలను వాడటం లాభదాయకం. మండలంలోని రైతుసేవా కేంద్రాలలో పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు పంపిణీ కొనసాగుతోంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

- కె.సీహెచ్ సూరిబాబు, మండల వ్యవసాయ అధికారి